
ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం.. శిలాఫలకంతోనే సరి

'ఎన్నికలకు ఆరు నెలల ముందు టెంకాయ కొడితే అది మోసం.. ఎన్నికలైన ఆరు నెలలకు టెంకాయ కొడితే అది చిత్తశుద్ధి' అంటూ స్టీలు ఫ్యాక్టరీ శంకుస్థాపన సందర్భంగా అప్పటి చంద్రబాబుపై విమర్శలు చేస్తూ జగన్ తన గురించి గొప్పలు చెప్పుకొచ్చారు. వచ్చే మూడేళ్లలో స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేసి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మూడేళ్లు కాదు కదా.. నాలుగేళ్లు దాటినా స్టీలుఫ్యాక్టరీ నిర్మాణం జరగలేదు. ఒకే ఫ్యాక్టరీకి రెండుసార్లు శంకుస్థాపన చేసిన సీఎంగా జగన్ చరిత్రపుటల్లో నిలిచిపోయారు.

మాట ఇస్తే మడమ తిప్పను, ఇచ్చిన మాట కోసం కట్టుబడి ఉండాలంటూ జగన్ పెద్ద పెద్ద మాటలు చెబుతారు. చెప్పారంటే చేస్తారంటూ జగన్ ఫ్యాన్స్ ఎలివేషన్‌లు ఇచ్చేవారు. అయితే జగన్ మాటకారి మాత్రమే అని తేలిపోయింది. ప్రతిపక్షనేత మొదలు సీఎం హోదాలో జిల్లా అభివృద్ధిపై ఎన్నో మాటలు చెప్పారు. కడప జిల్లా సమగ్రాభివృద్ధిని 70 ఎంఎం సినిమాలో చూపించారు. అదంతా ఉత్తుత్తి అని తేలింది. వెరసి జగన్ ఇచ్చిన హామీలు శిలాఫలకాల రూపంలో వెక్కిరిస్తున్నాయి.

హామీల జఘనుడు

- ప్రతిపక్షనేతగా, సీఎం హోదాలో జగన్ ఎన్నో హామీలు
- మూడేళ్లలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణమంటూ ప్రగల్బాలు
- రెండుసార్లు శంకుస్థాపనలకే పరిమితం
- కొప్పర్తి పారిశ్రామికవాడలో.. 2.50 లక్షల ఉద్యోగాలంటూ గొప్పలు
- కుందూ ఎత్తిపోతలతో సస్యశ్యామలమంటూ డాంబికాలు
- ఎత్తిపోతల ఒట్టిమాటలే
- గండికోట ముంపువాసులకు మస్కా
- ఫిష్ ఆంధ్రా అపహాస్యం
- యూసీఐఎల్ పరివాహక గ్రామాలకు మంచినీరేదీ..?



మోసం గురూ!

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ కుటుంబానికి కడప జిల్లా అండగా ఉంటూ వచ్చింది. 2004 ఎన్నికల నుంచి 2019వరకు ఉమ్మడి జిల్లా అంతా జగన్ కుటుంబానికే అండగా నిలిచింది. ప్రతి ఎన్నికల్లో మెజార్టీ సీట్లను కట్టబెడితే 2019 ఎన్నికల్లో ఏకపక్షంగా పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను వైసీపీకే కట్టబెట్టారు. అయితే వెన్నంటి అండగా నిలిచిన జిల్లా ప్రజల రుణం తీర్చుకునే అవకాశం జగన్‌కు దక్కింది. ఎందుకంటే ఆయన కడప జిల్లా నుంచి రెండో ముఖ్యమంత్రి. ప్రతిపక్ష నేతగా.. సీఎంగా జిల్లాకు ఎన్నో హామీలు ఇచ్చారు. అమలులో మాత్రం చతికిలపడ్డారు.. జగన్ ఇచ్చిన ప్రధాన హామీలను పరిశీలిస్తే..

తొలిహామీనే మడత పెట్టేశారు..

ప్రతిపక్షనేత హోదాలో సీఎం జగన్ 2017 నవంబరు 6న ఇడుపులపాయ నుంచి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర నవంబరు 9కి ఎర్రగుంట్ల చేరుకుంది. ఎర్రగుంట్ల సభలో అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరిస్తామని తొలి హామీ ఇచ్చారు. ఈ సభకు ఏపీ ట్రాన్స్‌కో ఆర్టీపీపీతో పాటు పలు విద్యుత్ కార్మికులు హాజరయ్యారు. జగన్ సీఎం కావడంతో ఉద్యోగాలు రెగ్యులర్ అవుతాయని కార్మికులు సంబరపడ్డారు. అధికారం చేపట్టాక తొలి హామీనే మడత పెట్టేశారు.

ఒక స్టీలు ఫ్యాక్టరీ.. రెండుసార్లు శంకుస్థాపన

ఎక్కడైనా ఏదైనా పని ప్రారంభించినప్పుడు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేస్తారు. నిర్మాణం పూర్తయిన తరువాత ప్రారంభిస్తారు. అయితే జిల్లాలో స్టీలు ఫ్యాక్టరీకి మాత్రం జగనే రెండుసార్లు టెంకాయకొట్టి భూమిపూజ చేయడం గమనార్హం. తొలుత 2019 డిసెంబరు 23న జమ్మలమడుగు మండలంలోని కన్యతీర్థం వద్ద స్టీలు ఫ్యాక్టరీకి భూమిపూజ చేశారు. మూడేళ్లలో స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేసి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మూడేళ్లు దాటినా స్టీలుఫ్యాక్టరీ నిర్మాణానికి అడుగు పడలేదు. మూడు సంవత్సరాల మూడు నెలలకు జగన్ మళ్లీ వచ్చారు. పరిశ్రమ ప్రారంభోత్సవానికి కాదు.. రెండోసారి శంకుస్థాపనకు. 2023 ఫిబ్రవరి 15న రెండోసారి మళ్లీ భూమిపూజ చేశారు. 30 నెలల్లో ఉక్కు పరిశ్రమ మొదటి దశ నిర్మాణం పూర్తవుతుంది. జిల్లా ముఖచిత్రమే మారిపోతుందని చెప్పుకొచ్చారు. స్టీలు ఫ్యాక్టరీ కోసం 3500 ఎకరాలను జిందాల్‌కు అప్పగించారు. ఫ్యాక్టరీ పూర్తయింటే ప్రత్యక్షంగా 25వేల మందికి, పరోక్షంగా మరో 20వేల మందికి ఉద్యోగాలు వచ్చేవి. రెండోసారి శంకుస్థాపన చేసి ఏడాది దాటినా పనులు సాగలేదు. స్టీలు ఫ్యాక్టరీ పూర్తిచేయక నిరుద్యోగులకు టోపీ పెట్టారు.

మాటల కోటలు

"బ్రహ్మంసాగర్‌కు 1.50 లక్షల ఆయకట్టు ఉంది. 17 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. అయితే ఇప్పటి వరకు అరకొర నీరు వస్తున్న పరిస్థితులు మన కళ్లెదుట కనిపిస్తున్నాయి. నాకు తెలిసి దివంగత వైఎస్ హయాంలో ఒకే ఒక సంవత్సరం 13 టీఎంసీల నీటిని నిల్వ చేశారు. ఇక రైతుల అవసరాలు తీర్చడానికి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుడుతున్నాం. జొన్నవరం వద్ద కుందూపై ఎత్తిపోతల పథకం నిర్మించి ఎస్‌ఆర్-1 ద్వారా 8 టీఎంసీల నీటిని బ్రహ్మంసాగర్‌లోకి నింపుతాం. దీని కోసం రూ.564 కోట్లు కేటాయిస్తున్నామని సగర్వంగా చెబుతున్నాం... ఈ పథకం ద్వారా ముతుకూరు, బద్వేలు అన్నదాతలకు మంచి జరుగుతుందని మనస్ఫూర్తిగా మొదలుపెడుతున్నాం. బ్రహ్మంసాగర్ కింద 90 వేల ఎకరాలను స్థిరీకరిస్తున్నాం. మరో 72 చెరువులకు నీరు ఇస్తున్నాం.." అంటూ 2019 డిసెంబరు 23న దువ్వూరు మండలం నేలటూరు వద్ద జరిగిన బహిరంగసభలో చెప్పుకొచ్చారు. రాయలసీమ కరువునివారణ పథకంలో భాగంగా ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు. 2021 మార్చి 21న అగ్రిమెంటు కూడా జరిగింది. అయితే పనుల్లో ఎలాంటి కదలిక లేదు. ఎత్తిపోతల ఒట్టిమాటలే.

ముంపువాసులకు టోపీ

చంద్రబాబు హయాంలో గండికోట ముంపువాసులకు రూ.6.75 లక్షల పరిహారం ఇచ్చారు. అప్పటి వరకు రూ.1.82లక్షలుగా ఉన్న పరిహారాన్ని టీడీపీ అమాంతంగా పెంచేసి రూ.6.75లక్షలను అందించారు. అయితే జగన్ తాను సీఎం అయితే రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బాధితులకు సుమారు రూ.454.6 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు సంబంధించి జీవో ఇచ్చినప్పటికీ ఒక్క పైసా విడుదల చేయలేదు. మాట ఇచ్చి మరిచిపోయావా జగన్ అంటూ ప్రశ్నిస్తున్నారు.

ప్రొద్దుటూరులో పాలకేంద్రం ఏదీ?

ప్రొద్దుటూరులో పాల ఉత్పత్తి కేంద్రాన్ని తెరిపిస్తామని హామీ ఇచ్చారు. మళ్లీ ఎన్నికలు వచ్చినప్పటికీ పాలకేంద్రం తెరుచుకోలేకపోయింది.

రాయలసీమకు ఇండస్ట్రియల్ హబ్ చేశావా..?

కొప్పర్తి పారిశ్రామికవాడ రాయలసీమకే ఇండస్ట్రియల్ హబ్. ఇక్కడ స్టీలు ఫ్యాక్టరీతో దాదాపు 2.50 లక్షల ఉద్యోగాలు వస్తాయంటూ ఘనంగా చెప్పుకొచ్చారు. 2022 డిసెంబరు 23న కొప్పర్తి పారిశ్రామికవాడలో రూ.700 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు శంకుస్థాపన చేశారు. అయితే అక్కడ డిక్సన్ తప్ప ముందు చెప్పిన పరిశ్రమలేవీ రాలేదు.

చరిత్రపుటల్లోకి చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ

"చెన్నూరు షుగరు ఫ్యాక్టరీ మూతపడకుండా ఉండేందుకు రూ.60 కోట్లు మంజూరు చేస్తున్నాం. అక్కడ కో ఆపరేషన్ ప్లాంటు ఏర్పాటు చేస్తాం. చెరుకు పిప్పి ద్వారా విద్యుత్ తయారు చేసి ఫ్యాక్టరీని వాడుకునేందుకు ఏర్పాటు చేస్తాం. దీని వల్ల మరికొంత మంది యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయి. ఇథనాల్ తయారీకి మరో ప్లాంటు ఏర్పాటు చేస్తాం.. ఎట్టిపరిస్థితుల్లో మూతపడనీయం.." అంటూ 2019 జూలైలో జమ్మలమడుగు సభలో చెప్పుకొచ్చారు. అయితే ఐదేళ్లు గడిచేసరికి అక్కడ షుగరు ఫ్యాక్టరీ లేకుండా పోయింది. చక్కెర ఫ్యాక్టరీని మిషన్‌తో సహా అమ్మేశారు. ఇప్పుడు షుగరు ఫ్యాక్టరీ చరిత్ర పుటల్లో చేరిపోయింది.

అటకెక్కిన సుందరీకరణ

దేవుని కడప చెరువును హైదరాబాదు ట్యాంకుబండ్ తరహా అభివృద్ధి చేస్తామంటూ చెప్పుకొచ్చారు. రూ.55 కోట్లతో పనులు చేపడతామని హామీ ఇచ్చారు. 2021 మార్చిలో టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఇంతవరకు పనులు మొదలు కాలేదు. కడప నగర శివారులోని రామనపల్లె, పుట్లంపల్లె చెర్లోపల్లె చెరువులను రూ.5.73 కోట్లతో సుందరీకరణ చేస్తున్నట్లు సీఎం జగన్ చెప్పుకొచ్చారు. 2021 జూలై 10న శంకుస్థాపన చేశారు. ఈ పనులూ నిలిచిపోయాయి.

హామీలకు పాతర

సీఎం జగన్ బద్వేలులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా అట్లూరు మండలంలో వేములూరు వద్ద సగిలేరుపై రూ.22 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ బ్రిడ్జి పూర్తయితే 30 గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని చెప్పుకొచ్చారు. కలసపాడు మండలంలోని సగిలేరుపై రూ.9.5 కోట్ల వ్యయంతో నిర్మించే బ్రిడ్జికి కూడా శంకుస్థాపన చేశారు. వీటి పనులు చేపట్టలేదు.

అర్ధాంతరంగా నిలిచిన అభివృద్ధి పనులు

వేంపల్లెలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉంది. కానీ ప్రస్తుతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.92కోట్లతో మంజూరయ్యాయి. ఎన్నికలకు ఆరు నెలల ముందు హైదరాబాద్ ఎస్‌ఎల్‌ఆర్ కంపెనీ ఆధ్వర్యంలో హడావిడిగా పనులు మొదలుపెట్టారు. చింతలమడుగుపల్లె, రాజీవ్‌నగర్ కాలనీ, పులివెందుల రోడ్డులో, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కందుల కాంప్లెక్స్ వరకు, మరికొన్ని చోట్ల పదిశాతం మేర పనులు చేశారు. కారణం ఏమో తెలియదు పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. బిల్లులు సక్రమంగా రాలేదనో, ఎన్నికల వేళ అనో కారణం ఏదైనా యూజీడీ పనులు నిలిచిపోవడంతో పలు వీధుల్లో గుంతలు ఏర్పడి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేంపల్లె ప్రధాన రోడ్లలో సిమెంటు రోడ్లు, సైడు కాల్వల నిర్మాణం కోసం పనులు మంజూరయ్యాయి. రోడ్డును విస్తరించి ఈ పనులు చేయాల్సి ఉంది. రోడ్డు విస్తరణలో స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న వాటిని తొలగించేందుకే ఏడాదిన్నరకు పైగా సమయం పట్టింది. నిధుల కొరత కారణంగా జాప్యం జరిగింది. ఎన్నికలు వస్తున్నాయనేమో మూడు నెలల ముందు హడావిడిగా కాల్వ నిర్మాణం, సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి నాలుగురోడ్ల కూడలి మీదుగా హనుమాన్ జంక్షన్ వరకు, నాలుగురోడ్ల కూడలి నుంచి గండిరోడ్డు వరకు పనులు చేయాల్సి ఉంది. అయితే కాల్వలు తీసేందుకు గుంతలు తీసిన కాంట్రాక్టర్లు కాల్వలను గ్యాపులు గ్యాపులుగా నిర్మించారు. దీంతో అటు కాల్వ నిర్మాణం కాక, ఇళ్ల ముందు గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలతో ప్రధాన రహదారిలోని వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక సిమెంటు రోడ్డుకు సంబంధించి ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కందుల కాంప్లెక్స్ వరకు ఒకవైపు పూర్తిచేశారు. రెండవ వైపు పనులు ప్రారంభించి పూర్తిగా నిలిపివేశారు.

వామ్మో పులివెందుల-ముద్దనూరు రోడ్డా..

పులివెందుల-ముద్దనూరు రోడ్డులో అడుగడుగునా గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడతున్నారు. జాతీయ రోడ్డుగా ఎంపికైనప్పటికి ఆ రోడ్డున వెళ్లే వాహనదారులు నరకం చూస్తున్నారు. 36కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు రెండు గంటల ప్రయాణం సాగించాల్సిందే.

దాహంతో యూసీఐఎల్ గ్రామాలు

పులివెందుల నియోజకవర్గంలోని యూసీఐఎల్ పరివాహక గ్రామాల్లో యూసీఐఎల్ టెయిలింగ్ పాండ్ వల్ల భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని ప్రభుత్వం చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్‌కు ఏర్పాటు చేసింది. 2021 జూన్‌లో రూ.1103 కోట్లతో ఎత్తిపోతల పథకం ప్రారంభించింది. పనులు ప్రారంభించి మూడు సంవత్సరాలు గడుస్తున్నా 50శాతం పనులు కూడా పూర్తి కాలేదు. యూసీఐఎల్ పరివాహక గ్రామాలైన 7 గ్రామాలతో పాటు లింగాల మండలంలోని దాదాపు 15 గ్రామాలకు నీటిని అందించేందుకు ఎత్తిపోతల పథకాలు ప్రారంభించారు. గిడ్డంగివారిపల్లె వద్ద నిర్మించే రిజర్వాయర్‌కు నీరు అందించాలి. అక్కడి నుంచి గ్రామాలకు నీటిని సరఫరా చేస్తారు. రూ.1103 కోట్లలో ఇప్పటి వరకు రూ.270 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారిక లెక్క. 48 కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు ఏర్పాటుచేయాల్సి ఉంటే 10 కిలోమీటర్లు మాత్రమే పనులు పూర్తి చేసినట్లు సమాచారం. చిత్రావతి బ్యాలెన్సిగ్ రిజర్వాయర్ కోసం పంప్‌హౌస్ పనులు పునాది దశలోనే ఉన్నాయి.

బిల్లులు చెల్లించక..

పులివెందుల నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరు అందించే లక్ష్యంతో జగన్ ప్రభుత్వం మైక్రోఇరిగేషన్ రెండో విడత పనులను చేపట్టింది. ఈ పనులను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. బిల్లులు చెల్లించడం లేదని పనులు ఆగిపోయాయి. సంబంధింత కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వం బిల్లులే చెల్లించలేదు పనులు ఎలా చేస్తామని పేర్కొన్నారు. దీనికి అధికారుల నుంచి స్పందన కరువైందని చెప్పాలి.


పులివెందులలో ఒక్క ఇల్లూ పూర్తి కాలేదు

పులివెందుల పట్టణంలోని జగనన్న మెగా లేఅవుట్‌లో 7079 ఇళ్లు నిర్మిస్తామని ప్రజలకు పట్టాలు పంపిణీ చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తకంటే దారుణంగా పనులు సాగించారు. అనంతరం అప్పటికే ఉన్న కాంట్రాక్టర్‌కు కొన్ని ఇళ్లు, మరో సంస్థకు కొన్ని ఇళ్లు కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో ఒక్క ఇల్లు కూడా పూర్తికాకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు 2805 స్లాబ్ లెవెల్‌లో ఉండగా 2104 ఇళ్ల స్లాబ్‌లు పూర్తి చేశారు. స్లాబ్‌లు పూర్తిచేసినప్పటికి మిగిలిన పనులు ఒక్కటి పూర్తి కాలేదు. దీంతో పులివెందుల పేద ప్రజలకు సొంతింటి కల కలగా మిగిలిందనే చెప్పాలి.


మూణ్ణాళ్ల ముచ్చటగా ఫిష్ ఆంధ్రా హబ్

"పులివెందులతో పాటు పరిసర ప్రాంత వాసులకు చేపలు, రొయ్యలు.. ఇది నిజంగా నేను ఏ పొద్దు అనుకోలేదు.. పులివెందులలో చేపలు, రొయ్యలకు సంబంధించిన దుకాణాలు కూడా వస్తాయని... బహుశా ఎవ్వరం కూడా ఊహించి ఉండం. ఫ్రెష్షుగా ఉన్న ప్రాన్సు ఫ్రెష్షుగా ఉన్న చేపలను అందుబాటులోకి తీసుకొచ్చి ఆక్వా హబ్‌ను ఈరోజు ఇక్కడ ప్రారంభిస్తా ఉన్నాం. ఈ ఆక్వాహబ్‌తో పాటు నియోజకవర్గంలో వందకు పైగా ఫిష్ కియోస్క్‌లు అంటే రిటైల్ షాపులు తెరుస్తున్నాం.." అని 2021 డిసెంబరు 24వ తేదీ పులివెందులలో సీఎం జగన్ అన్నారు. కోటి రూపాయలకు పైగా వ్యయం చేసిన హబ్ మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. తెరిచిన రెండు నెలలకే అంటే ఫిబ్రవరి 2022 కల్లా మూతపడింది. రూ.1.25 లక్షల కరెంటు బిల్లు చెల్లించాలని విద్యుత్ శాఖ చెప్పినా ఫిష్ హబ్ యాజమాన్యం పట్టించుకోలేదు. సరఫరా తీసివేయడంతో జర్మనీ యంత్రాలు మూలకు చేరాయి. సొంత నియోజకవర్గంలో సిగ్గుచేటు అనుకున్న పులివెందుల ప్రజాప్రతినిధులు సమీప చెరువుల నుంచి చేపలు, రొయ్యలు తెచ్చి విక్రయాలు జరిపారు. జనం నుంచి స్పందన లేకపోవడంతో నెలకే అది కూడా మూతపడింది. ఇలా కాదని మటన్ సెంటర్‌గా మార్చారు. ఆవరణలో మటన్ అమ్మకాలు సాగుతున్నాయి. ఫిష్ హబ్ నిర్మాణాలు మాత్రం వైసీపీ నాయకులకు పార్టీలు చేసుకోవడానికి, సెటిల్‌మెంట్‌లకు నిలయంగా మారాయి.


సగిలేరుపై రూ.22 కోట్లతో నిర్మించే బ్రిడ్జి నిర్మిస్తామంటూ సీఎం జగన్ శంకుస్థాపన చేసింది ఈ వంతెన కోసమే.. ఇప్పటికీ ఇక్కడ పనులు మొదలు కాలేదు


బ్రిడ్జి పూర్తవుతుందని సంతోషపడ్డాం..

వానాకాలంలో నగిలేరులో నీరు ఉధృతంగా వచ్చినప్పుడు వంతెన లేక చాలా ఇబ్బందిపడ్డాం. దాదాపు నాలుగు నెలలు 25 గ్రామాలకు రాకపోకలు ఆగిపోతాయి. ఈ నేపథ్యంలో వేములూరు వద్ద జగన్ 2022 ఆగస్టు 8న వంతెనకు శంకుస్థాపన చేయడంతో కష్టాలు తీరిపోతాయని అనుకున్నాం. రెండేళ్లు దాటినా ఇంత వరకు పనులే పూర్తి కాలేదు.

- బి.నరసింహారెడ్డి, ముత్తుకూరు



అప్పుచేసి ఇళ్లు నిర్మించుకున్నాం..


ప్రభుత్వం పరిహారం ఇస్తుందన్న నమ్మకంతో అప్పుచేసి ఇళ్లు కట్టుకున్నాం. నాలుగేళ్లయినా పరిహారం ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పుకు వడ్డీలు కట్టలేకున్నాం. ముఖ్యమంత్రి జగన్ హామి ఇచ్చిన విధంగా వెంటనే మాకు రూ.3,25,000 పరిహారం చెల్లించాలి.

- వినయ్‌కుమార్‌రెడ్డి, గండికోట ముంపు బాధితుడు, దత్తాపురం గ్రామం

నాలుగేళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం


వైసీపీ ప్రభుత్వం హామి ఇచ్చిన అదనపు పరిహారం రూ. 3,25,000కోసం నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నాం. ఎలక్షన్లు వస్తున్నా ఇంతవరకు పరిహారం అందలేదు. మాకు పరిహారాన్ని వెంటనే పంపిణీ చేయాలి.

- విజయ్, గండికోట ముంపు బాధితుడు, దత్తాపురం


వేంపల్లె పట్టణం కడప-పులివెందుల రోడ్డులో అర్ధాంతరంగా నిలిపివేసిన సిమెంటు రోడ్డు పనులు


పులివెందుల-ముద్దనూరు మార్గంలో ఆగిపోయిన రోడ్డు పనులు

కదంతొక్కిన తెలుగు తమ్ముళ్లు

- అట్టహాసంగా టీడీపీ శ్రేణుల నామినేషన్లు
- కడపలో భారీ ర్యాలీ
- జనసందోహం మధ్య మాధవీరెడ్డి నామినేషన్
- నేడే నామినేషన్లకు చివరి రోజు
- పులివెందులలో నామినేషన్ వేయనున్న జగన్

(కడప - ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వానికి నేటితో తెర పడనుంది. ఇక చివరి రోజు సీఎం జగన్ పులివెందుల అసెంబ్లీకి నామినేషన్లు వేయనున్నారు. ఇక బుధవారం టీడీపీ శ్రేణులు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. కడప అసెంబ్లీ అభ్యర్థిగా ఆర్.మాధవీరెడ్డి భారీ జన సందోహం మధ్య వెళ్లి నామినేషన్ వేశారు. టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన నేతలు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ద్వారకానగర్ నుంచి సంధ్యాసర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, సెవెన్‌రోడ్స్ మీదుగా అశేష జనవాహిని మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ, బళ్లారి నుంచి వచ్చిన కళాకారులతో నృత్యాలు చేస్తూ భారీ స్థాయిలో ర్యాలీ చేశారు. దారి పొడవునా ఎటు చూసినా జనమే కనిపించారు. అడుగడుగునా ప్రచార రథంపై పూలమాలలు కురిపించారు. గజమాలతో స్వాగతం లభించింది. పులివెందులలో అసెంబ్లీ స్థానానికి బీటెక్ రవి పెద్ద ఎత్తున అనుచరులతో ర్యాలీగా వెళ్లి నామినేసన్ వేశారు. బద్వేలు ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీ నుంచి బొజ్జ రోశన్న నామినేషన్ వేశారు. పెద్దఎత్తున ముస్లింలు తరలివచ్చారు. జమ్మలమడుగు కూటమి అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డి నామినేషన్ వేశారు.

జనం లేక డిప్యూటీ సీఎం ర్యాలీ వెలవెల

టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి పెద్ద ఎత్తున కార్యకర్తలు, జనం రావడంతో రోడ్డంతా నిండిపోయాయి. అయితే డిప్యూటీ సీఎం అంజద్ బాషా నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ జనం లేక వెలవెలబోయింది. అంజద్‌బాషా స్వగృహం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం, వన్‌టౌన్ సర్కిల్ మీదుగా పోస్టాఫీసు వరకు ర్యాలీ చేపట్టారు. అయితే ఇక్కడ ర్యాలీలో పెద్దగా జనాలు లేరు. టీడీపీకి వచ్చిన జనాన్ని చూసి వైసీపీ నేతలే అవాక్కయ్యారు.

అవును.. ఆ ముగ్గురు ఒక్కటయ్యారు

కడప టీడీపీ అసెంబ్లీ టికెట్ కోసం ఆశించి భంగపడ్డ అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, అమీర్‌బాబు, శ్రీనివాసరెడ్డిలు ఒక్కటయ్యారు. కడప అసెంబ్లీ టికెట్‌ను కోడలు కోసం లక్ష్మిరెడ్డి ఆశించారు. అలాగే మరోసారి పోటీ చేయాలని అమీర్‌బాబు భావించారు. అయితే చివరికి అధిష్టానం శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవీకి ఇచ్చింది. దీంతో టికెట్ రాక భంగపడ్డ లక్ష్మిరెడ్డి, అమీర్‌బాబులు అసంతృప్తికి లోనయ్యారు. కొద్దిరోజులుగా ఉమ్మడిగా కలిసి పార్టీకార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు టీడీపీ నేత రవిచంద్ర, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిలు చర్చలు జరిపారు. అలాగే పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిలు అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, అమీర్‌బాబుతో సమావేశమై నామినేషన్ కార్యక్రమానికి ఆహ్వానించారు. దీంతో లక్ష్మిరెడ్డి, అమీర్‌బాబు, మన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఇన్నాళ్లు ఎడముఖం పెడముఖంతో ఉన్నవారు కలవడంతో టీడీపీ నేతల్లో జోష్ నింపింది.

కడపలో మాధవీరెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న అశేష జనవాహిని


కడప ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న మాధవీరెడ్డి




పులివెందులలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీటెక్ రవి


బద్వేలు, జమ్మలమడుగులో నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థులు రోశన్న, ఆదినారాయణరెడ్డి




మోసం గురూ! నీటి పథకం ఏమైంది జగనన్నా..?



- 2019లో డిసెంబరులో శిలాఫలకం వేశారు
- నేటికీ అతీగతి లేని నిర్మాణ పనులు
- నీటి పథకం రాకపాయే.. ట్యాంకుల నిర్మాణం చేపట్టకపాయే..!
- మా దాహార్తి తీర్చే దిక్కెవరు..?
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రాయచోటి పట్టణ ప్రజలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 24: డిసెంబరు-2019లో సీఎం జగన్ రాయచోటికి వచ్చిన సందర్భంగా ప్రస్తుతం ఉన్న నీటి పథకం నుంచి వస్తున్న నీరు పట్టణ ప్రజలకు సరిపోవడం లేదన్న కారణంగా రూ.98 కోట్లతో అదనపు నీటి పథకానికి శిలాఫలకం వేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ అదనపు నీటి పథకం పనులకు అతిగతీ లేకుండా పోయింది. ప్రస్తుతం వెలిగల్లు నీటి పథకాన్ని గాలివీడు, రాయచోటి మండలాల మీదుగా జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణానికి తీసుకొస్తున్నప్పటికీ ఆ నీరు పూర్తి స్థాయిలో రాయచోటి పట్టణానికి సరిపోవడం లేదు. మున్సిపాలిటీలో ఏరియాను బట్టి వారానికి ఒకరోజు, రెండు రోజులు, ఒక్కోచోట పది రోజులు.. ఎలా పడితే అలా వెలిగల్లు నీరు వస్తుండడంతో పట్టణ ప్రజలకు నీటి సమస్య తప్పడం లేదు. దీంతో పట్టణ ప్రజలు పలుమార్లు మున్సిపల్ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

ఈ క్రమంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం డిసెంబరు నెలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయచోటికి వచ్చిన సందర్భంగా రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి నిధులు వరదలు పారిస్తున్నామంటూ ఆర్భాటం చేసి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేసి పనులను మాత్రం గాలికి వదిలేశారు. ఇందులో భాగంగానే 300 కోట్లతో రాయచోటి మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ పనులంటూ గొప్పలు చెప్పిన అధికార పార్టీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితో పాటు మున్సిపల్ పాలకవర్గం కూడా పట్టణంలో ఎక్కడా అండర్ డ్రైనేజీ పనులను చేపట్టకుండా ఊరికి దూరంగా పట్టణం చుట్టుపక్కల త్వరత్వరగా అండర్ డ్రైనేజీ పనులు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ క్రమంలోనే ప్రధానంగా పట్టణ ప్రజలకు నీటి సమస్యను తీర్చే క్రమంలో రూ.98 కోట్లతో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అదనపు పైపులైన్‌తో పాటు దిగువగొట్టివీడు సమీపంలో ప్రస్తుతం ఉన్న నీటిశుద్ధి కేంద్రం కాకుండా అదనంగా మరో నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటు చేసి మున్సిపాలిటీ పరిధిలో 5 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణం కోసం పనులకు టెండర్లు పిలిచారు. అయితే పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు కేవలం వెలిగల్లు ప్రాజెక్టు నుంచి దిగువగొట్టివీడు వరకు పదిశాతం మాత్రమే పైపులైన్ ఏర్పాటు చేసి మిగిలిన పనులను చేయకుండా నిలిపివేశారు.

అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని

రూ.98 కోట్లతో చేపట్టిన వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అదనపు నీటి పథకం పనుల్లో ఇంకా దిగువగొట్టివీడు వద్ద నీటిశుద్ధి కేంద్రంతో పాటు రాయచోటి మున్సిపాలిటీ వరకు సుమారు 116 కి.మీ. మేర పైపులైను పనులు, మున్సిపాలిటీ పరిధిలో 5 ఓవర్ హెడ్ నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే గడిచిన ఐదేళ్లగా అదనపు నీటి పథకం పనులకు అతీగతి లేకుండా పోయింది. ఫలితంగా అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా వెలిగల్లు ప్రాజెక్టు నిండా నీరున్నా రాయచోటి పట్టణ ప్రజలకు మాత్రం పూర్తి స్థాయిలో తాగునీరు అందక నీటి ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

హామీలు హుళక్కే..!

రాయచోటి మున్సిపాలిటీ గ్రేడ్‌వన్ మున్సిపాలిటీ, స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసిన అధికార పార్టీ నేతలు అదే స్థాయిలో అమాంతంగా ఇంటి నిర్మాణాలు, ఇంటి స్థలాల అప్రూవల్‌తో పాటు, నీటి కుళాయిల అప్రూవల్, ఇంటి పన్ను, నీటి పన్ను ఇలా లక్షలాది రూపాయల పన్నులు వసూలు చేస్తోంది. ఈ క్రమంలో భాగంగా రోజు మార్చి రోజు వెలిగల్లు నీరు అందిస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చెప్పిన హామీలు గాలిలో దీపాలుగా మారుతున్నాయి. దీంతో ప్రస్తుతం రాయచోటి పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు మినహాయిస్తే మిగిలిన ప్రాంతాల్లో వారానికి ఒక రోజు పది రోజులకు ఒకరోజు మాత్రమే వెలిగల్లు నీరు అందుతుండడంతో పట్టణ ప్రజలకు నీటి బాధలు తప్పడం లేదు. ఐదు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం వెలిగల్లు నుంచి



వెలిగల్లు నీరు సక్రమంగా అందక ట్యాంకర్లతో నీరు పట్టుకుంటున్న దృశ్యం

రూ.98 కోట్లతో చేపట్టిన అదనపు నీటి పథకం పనుల్లో పదిశాతం కూడా పూర్తి చేయని పరిస్థితులు నెలకొనడంతో పట్టణ ప్రజల ఆశలు రోజు రోజుకు నీరుగారుతున్నాయి. దీనికి తోడు రాయచోటి పట్టణం జిల్లా కేంద్రం కావడంతో అదనంగా ఉద్యోగులతో పాటు ఇతర కార్మికులు, గ్రామీణులు జిల్లా కేంద్రానికి చేరుకోవడంతో నీటి సమస్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. అధికార పార్టీ నేతల అలసత్వంతో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్లగా పూర్తికాని అదనపు నీటి పథకం పనులు ఇంకెప్పుడు పూర్తవుతాయో, నీటి బాధలు ఎప్పుడు తీరుతాయో నని రాయచోటి పట్టణ ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూసి రూ.98 కోట్లతో చేపట్టిన అదనపు నీటి పథకం పనులను పూర్తిచేసి భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలకు తాగునీటిని అందిస్తాం

- వాసుబాబు, మున్సిపల్ కమిషనర్

రాయచోటి పట్టణానికి నిరంతరాయంగా నీటిని సరఫరా చేసే ఉద్దేశ్యంతో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రూ.98 కోట్లతో చేపట్టిన అదనపు నీటి పథకం పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ప్రాజెక్టు నుంచి 43 కి.మీ. మేర పైపులైన్ పనులు జరిగాయి. ఇంకా దిగువగొట్టివీడు వద్ద నీటిశుద్ధి కేంద్రంతో పాటు పైపులైన్ పనులు, రాయచోటి పట్టణంలో ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి పథకం ద్వారా పట్టణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తాగునీటి సరఫరా చేస్తాం.

సెమిస్టరు పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రారు సురేంద్రనాథరెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 24: కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలో స్కూలు ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్‌కు సంబంధించి మొదటి సెమిస్టరు రెగ్యులర్ పరీక్షల ఫలితాలను వైస్‌చాన్సలర్ ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రారు ప్రొఫెసరు సురేంద్రనాథరెడ్డిలు విడుదల చేశారు. బుధవారం యూనివర్శిటీలో పరీక్షల విభాగంతో కలిసి ఫలితాలు విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. అతి తక్కువ సమయంలోనే ఫలితాలను విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్ష విభాగాన్ని వీసీ, రిజిస్ట్రారు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రారు రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఈసీ సుప్రియ పాల్గొన్నారు.

కడపకు చేరుకున్న పోలీసు అబ్జర్వర్

కడప(క్రైం), ఏప్రిల్ 24: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కడప పార్లమెంటరీ పోలీసు అబ్జర్వర్‌గా నియమితులైన హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం, సిమ్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్న అర్జిత్‌సేన్‌ఠాకూర్ బుధవారం సాయంత్రం కడపకు చేరుకున్నారు. కడపలోని పోలీసు అతిథిగృహానికి ఆయన చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం కడపలో కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థకౌశల్‌ను కలిసి తమ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

దాడి కేసులో ఇరువురికి జైలు శిక్ష, జరిమానా

కడప(క్రైం), ఏప్రిల్ 24: మహిళను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడి చేసిన కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్షతో పాటు, రూ.5 వేల జరిమానా, మరొకరికి మూడునెలలు జైలుశిక్ష విధిస్తూ జేఎఫ్‌సీ స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి హేమస్రవంతి జానకిరామ్ తీర్పునిచ్చినట్లు రిమ్స్ సీఐ రామచంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కడప తిలక్‌నగర్‌కు చెందిన ఓ మహిళను తమ్మిశెట్టి రామసుబ్బయ్య, మంజులశ్రీనుతో కలిసి అసభ్య పదజాలంతో దూషించి ఆ మహిళపై దాడి చేయడంతో 2020లో వీరిపై కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ కేసులో జడ్జి విచారించి నేరం రుజువు కావడంతో రామసుబ్బయ్యకు మూడునెలలు జైలు శిక్ష, మంజుల శ్రీనుకు ఏడాది జైలుశిక్ష విధించడంతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

రూ.11.41 కోట్ల మద్యం, నగదు సీజ్

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 24: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 44 రోజుల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో భాగంగా చేపట్టిన తనిఖీల్లో రూ.11.41 కోట్ల విలువైన మద్యం, ఇతర వస్తువులు, నగదును అధికారులు సీజ్ చేసినట్లు కలెక్టరు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తు సామగ్రి రూ.7,64,35,209ను వివిధ విభాగాల తనికీ అధికారులు సీజ్ చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా రూ.50 వేలకు పైబడి తీసుకెళుతున్న రూ.3,76,96,225ల నగదును సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఈ కాళ్లు పట్టుకోవడాలేందబ్బా..!



పెద్దిరెడ్డి కాళ్లు మొక్కుతున్న చింతల.. అదోరకంగా చూస్తున్న మిథున్, చప్పట్లు కొడుతున్న శ్రీనాథ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 24: ఆయన ఎమ్మెల్యేగా జూనియరే అయినా సీనియర్ మంత్రి. మరొకాయనేమో మంత్రి కాలేక పోయిన సీనియర్ ఎమ్మెల్యే. ఆయనా రామచంద్రారెడ్డే.. ఈయనా రామచంద్రారెడ్డే.. మరి ఈ కాళ్లు పట్టుకోవడ మేంది రామచాంద్రా ! అంటూ సోమవారం నుంచి పీలేరు ప్రజల్లో తెగ చర్చ నడుస్తోంది. దీనికి తోడు పొద్దున, రాత్రి ఈ కాళ్ల పట్టుకోవడాల గురించి ఇప్పటికే జిల్లా మొత్తం అట్టుడికిపోతోంది. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి వాస్తవానికి జిల్లాలో అందరికన్నా సీనియర్ ఎమ్మెల్యే. అవును మరి చింతల రామచంద్రారెడ్డి 1988లో మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. మరో మూడు దఫాలు తిరిగి ఎన్నికయ్యారు. పెద్దిరెడ్డి మాత్రం 1989లో తొలి సారిగా ఎమ్మెల్యే అయ్యారు. అంటే ఎమ్మెల్యేగా చింతల సీనియరే కదా అంటున్నారు. చింతల టీడీపీ, పీఆర్‌పీ పార్టీలు మారి వైసీపీలో కుదురుకున్నారు. పెద్దిరెడ్డి కూడా జనతా, కాంగ్రెస్ పార్టీలు మారి వైసీపీలో చేరి నిలదొక్కుకున్నారు. మంత్రి కూడా అయ్యారు. ఇలా వుండగా సోమవారం మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైసీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. పీలేరు సమావేశంలో వైసీపీ అభ్యర్థిత్వానికి సంబంధించిన బిఫారం చింతలకు అందజేశారు. బి ఫారం తీసుకున్న చింతల అమాంతంగా పెద్దిరెడ్డి కాళ్లకు మొక్కారు. అదే వేదిక మీదున్న మిథున్ రెడ్డి ఈ సీన్‌ను వింతగా చూస్తుండగా, పక్కనే వున్న మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి తదితరులు చప్పట్లు కొట్టారు. పీలేరు గౌరవాన్ని పెద్దిరెడ్డి కాళ్ల ముందు చింతల తాకట్టు పెట్టారని తాము చేస్తున్న ఆరోపణలకు ఇదిగో రుజువంటూ దీనికి సంబంధించిన ఫొటోలను ప్రత్యర్థి పార్టీ వాళ్లు తెగ వైరల్ చేస్తున్నారు. తనకు ఈ సారి టికెట్టు దక్కుతుందో లేదోనన్న సందేహం చింతలను పీడించేది. చివరకు బి ఫారం దక్కడంతో ఆనందంతో భావోద్వేగానికి గురై ఇలా కాళ్లు పట్టుకోవడం జరిగిందని చెప్పుకుంటున్నారు.

రేషన్ డీలర్ అక్రమాలు.. ఫిర్యాదుదారులపై దౌర్జన్యం



దాడిలో ధ్వంసమైన అద్దాలు, కంప్యూటరు, (ఇన్‌సెట్లో) దాడికి గురైన నాగరాజు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 24: మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ అమృతనగర్‌లోని 143 రేషన్‌డీలర్ నిజాం సరుకులు సక్రమంగా పంచకుండా అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ రేషన్‌బియ్యం, చెక్కర అమ్ముకుంటున్నాడని స్థానికులు బుధవారం సాయంత్రం డిప్యూటి తహసీల్దారు సాయినాథరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని డీలర్, ఎండీయూ ఆపరేటర్ నిజాం, అతని భార్య కుటుంబ సభ్యులతో కలిసి తమపైనే ఫిర్యాదు చేస్తారా అని స్థానిక మాజీ విలేకరి గిద్దలూరు నాగరాజుపై దాడి చేశారు. అతని స్టూడియో అద్దాలు పగులగొట్టి కంప్యూటర్లు ధ్వంసం చేశారు. ఈ దాడిలో గాయపడిన నాగరాజును స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు దాడి ఘటనపై బాధితుడి స్టూడియో వద్దకు వెళ్లి విచారించారు. అనంతరం నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ నాగేశ్వరరావు తెలిపారు.

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



ప్రతిభ కనబర్చిన వైష్ణవి, చర్మిళ, రిషిత, కార్తీక్, గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపా ధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతి రాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం

కమలాపురం రూరల్, ఏప్రిల్ 24: కమలాపురం ఉరుసు మహోత్సవంలో భాగంగా మూడో రోజు ప్రభుత్వ లాంచనాలతో ఛాదర్ సమర్పించారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు దేశ నలుమూలల నుంచి ఈ ఉరుసు మహోత్సవానికి స్వామివారు భక్తులు తరలి వచ్చారు. ఉరుసు ఊరేగింపు సందర్భంగా రాత్రికి మేళ తాళాలతో, చిన్నారుల కేరింతలతో, ఫక్కీరు విన్యాసాలతో బాణసంచా పేలుస్తూ తీసుకువచ్చారు. ప్రస్తుత మఠాధిపతి ముతవల్లి హజరత్ ఫైజుల్ గఫాచాఖాద్రి, ఆయన సోదరులు పాల్గొన్నారు.

అనంతరం దర్గా ఆవరణంలో పాలదంతాలు గల వృషభరాజములచే నిర్వహించిన బండలాగుడు పోటీల విజేతలకు బహుమతులను కన్వీనరు ఇస్మాయిల్, కమిటీ సభ్యులు అందించారు.

డాక్టర్ కావాలని కష్టపడ్డాను..
ఇప్పుడు నాన్న కోసం కష్టపడుతున్నా

- కోర్టులకు, ఆఫీసులకు వెళ్లాను.. ఇప్పుడు మీ వద్దకు వచ్చాను
- వివేకాకు న్యాయం చేయాలంటే షర్మిలను గెలిపించండి : డాక్టర్ సునీత



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీత

లింగాల, ఏప్రిల్ 24: 'నేను చదువుకునే సమయంలో నాన్న ఒక మాట అనేవారు.. బాగా కష్టపడి డాక్టర్ కావాలని. దానికోసం ఎంత కష్టపడ్డానో.. ఇప్పుడు ఆ మాట అన్న నాన్న కోసం అంతకంటే ఎక్కువ కష్టపడుతున్నా' అని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ వైఎస్ సునీత అన్నారు. మండలంలోని వెలిదండ్ల, కోమన్నూతల, లింగాల, పార్నపల్లె తదితర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని బుధవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివేకానందరెడ్డి కూతురుని, మీ ఆడబిడ్డను అన్నారు. తమ అమ్మ సౌభాగ్యమ్మది ఈ ఊరే అని, వైఎస్ వివేకానందరెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల గురించి తనకంటే మీకే బాగా తెలుసన్నారు. ఎప్పుడు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారన్నారు. ఆఖరు వరకు పులివెందుల ప్రజల గురించి ఆలోచించారన్నారు. అప్పటిలోనే చెన్నైలో తాను చదువుకునే సమయంలో తన తండ్రి అక్కడకు వచ్చేవారని, కష్టపడి చదివి డాక్టర్ అయి అందరికీ సేవ చేయాలన్నారు. అందుకోసం ఎంత కష్టపడ్డానో ఇప్పుడు నాన్న కోసం అంతే కష్టపడాల్సి వస్తోందన్నారు. మీ ఇంటి ఆడపడుచు సౌభాగ్యమ్మకు ఈ అన్యాయం జరిగిందని, మనం చూస్తూ ఉండవచ్చా అని ప్రజలను అడిగారు. వివేకానందరెడ్డి వద్దకు మీరు ఎప్పుడైనా వెళితే మీరు ఏ పార్టీ, ఏ కులం, ఏ జాతి అని చూడకుండా ఎవరు వెళ్లినా సహాయం చేసేవారన్నారు. ఇప్పుడు ఆయన కోసం మిమ్మల్ని ప్రాధేయపడుతున్నా న్యాయం చేయండి అని వేడుకొన్నారు. నిందితులకు ఓటు వేయొద్దని, న్యాయం కోసం ఓటు వేయాలని కోరారు. వివేకాకు న్యాయం చేయాలంటే ఈ పని చేయాలని, అప్పుడే ఎవరైనా తప్పు చేయాలంటే భయపడతారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముద్దుల కుమార్తె వైఎస్ షర్మిలను ఎంపీగా గెలిపించుకోవాలన్నారు. ఐదేళ్లగా న్యాయం కోసం ప్రతి కార్యాలయానికి, కోర్టులకు, ఆఫీసులకు వెళ్లి కొట్లాడి.. కొట్లాడి మీ వద్దకు వచ్చానన్నారు. వివేకానందరెడ్డిని అంతగా క్రూరంగా నరికి నరికి చంపారన్నారు. తమకంటే మీతోనే ఎక్కువగా ఉన్న వ్యక్తికి ఇంత అన్యాయం జరిగితే చూస్తూ ఉంటారా అన్నారు. నిందితులకు ఓటు వేయొద్దు, వైఎస్ షర్మిలకు ఓటు వేసి గెలిపించి వివేకానందరెడ్డికి న్యాయం చేయాలని కోరారు. అలాగే పులివెందుల కాంగ్రెస్ అభ్యర్థి ధ్రువకుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, ధ్రువకుమార్‌రెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న మారెమ్మ జాతర

కడప(కల్చరల్), ఏప్రిల్ 24: మారెమ్మతల్లి ఆలయ 20వ వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని కడప నగర 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో ఈ నెల 27, 28వ తేదీల్లో జాతర మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు రెడ్డిచెర్ల జయరామిరెడ్డి తెలిపారు. తొలుత 27న అమ్మవారికి గణపతిపూజ, రుద్రాభిషేకం, మహానైవేద్యం, మహా మంగళహారతి, మంత్రపుష్పం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం వుంటుందన్నారు. తదుపరి 28న జాతర కార్యక్రమం, అమ్మవారికి నిండు కుండ బోనాల సమర్పణ ఉంటుందన్నారు. అనంతరం న్యూకేటగిరి విభాగ వృషభరాజములచే బండలాగుడు పోటీలుంటాయని తెలిపారు. ఇందులో గెలుపొందిన ప్రథమ విజేతకు రూ.60 వేలు, ద్వితీయ విజేతకు రూ.40వేలు, తృతీయ విజేతకు రూ.30 వేలు, నాల్గవ విజేతకు రూ.20 వేలు, ఐదవ విజేతకు రూ.10వేలు, ఆరవ విజేతకు రూ.5వేలుగా నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. కాగా మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు కోలాటం కార్యక్రమం వుంటుందన్నారు.



మారెమ్మతల్లి మూలవిరాట్

వైసీపీ జెండా పట్టుకో... బిర్యాని అందుకో

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 24: వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు రండి.. డబ్బుతో పాటు బిర్యాని పొట్లం అందుకోండంటూ ప్రచారం చేయడంతో.. బుధవారం వైసీపీ అభ్యర్థి నిస్సార్ అహ్మద్ నామినేషన్ ర్యాలీలో పెద్దసంఖ్యలో పేదలు పాల్గొ న్నారు. ర్యాలీలో పాల్గొన్న వారందరికీ స్థానిక బేబీ వెల్‌కమ్ హోమ్ స్థలంలో బిర్యానీ వడ్డించారు. ఈ సందర్భంగా వైసీపీ జెండాలు, ప్లకార్డులు పట్టుకున్న వారందరు వాటిని పారవేసి తొక్కుకుంటూ బిర్యానీకి ఎగబడ్డారు. అంత వరకు జై జగన్ అంటూ నినాదాలు చేసిన వారు ఘుమఘుమలాడే బిర్యాని వాసన రాగానే జగన్ జెండాలు పారేసి కడుపారా లాగించేసి వెళ్లి పోయారు. కాగా.. వైసీపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా ఉదయం 10గంటల నుంచి మదనపల్లెలో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో అప్పారావు వీధి, త్యాగరాజు వీధి నుంచి ప్రభుత్వాస్పత్రికి వెళ్లవారికి దారి లేక జనం అవస్థలు పడ్డారు. అదే విధంగా సీటీఎం రోడ్డు, బెంగళూరు రోడ్డు మార్గాల్లో వెళ్లే వాహనదారులు వైసీపీ నాయకులను తిట్టుకుంటూ రెండు కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి వచ్చింది.



బేబీ వెల్‌కమ్ హోమ్ స్థలంలో బిర్యాని కోసం ఎగబడుతున్న జనాలు



ఎంగిలి ప్లేట్లతో పాటు పారేసిన వైసీపీ జెండాలు

జగన్‌రెడ్డి ఓటమితోనే మాదిగలకు ఉజ్వల భవిష్యత్

- ఏపీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కడప(మారుతీనగర్) ఏప్రిల్ 24: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత సీఎం జగన్‌రెడ్డిని ఓడించడం ద్వారానే రాష్ట్రంలోని మాదిగలకు ఉజ్వల భవిష్యత్తు దక్కుతుందని ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగలకు సూచించారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా బుధవారం కడప ప్రెస్ క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు రక్షణ కొరవడిందని, ఏపీని గాడిలో పెట్టే సత్తా చంద్రబాబుకే వుందని, ఆ దిశగా దళితులు చైతన్యవంతులు కావాలన్నారు. అనంతరం ముద్రించిన కరపత్రాలను 35 మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. వైసీపీ పాలనలో గత 5 సంవత్సరాలుగా ఎస్సీలకు సంబంధించిన 27 పథకాలను జగన్‌రెడ్డి రద్దుపరచి దళితుల నోట్లో మట్టికొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవరత్నాలు, అమ్మఒడి పేరుతో ఎస్సీ కార్పొరేషన్ నిధులను, అలాగే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దండుకుని దళితుల నోటికందే కూడు దక్కకుండా చేసిన ఏకైక సీఎంగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. మాదిగ జాతికి అండగా నిలబడిన టీడీపీ అధినేత చంద్రన్నకే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలు అండగా నిలవాలని కోరారు. గత ఎన్నికల ముందు కోడికత్తి డ్రామా ఆడిన జగన్‌రెడ్డి ప్రస్తుతం ఓటమి భయంతో గులకరాయి డ్రామాకు తెరతీయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రం మరో బీహార్ కావడం తథ్యమన్నారు. సమావేశంలో మాదిగ సంఘాల నాయకులు ఆర్.జె. ప్రకాష్, రమేష్, మునెయ్య, జిల్లా అధ్యక్షుడు శివ, కె.బెంజిమెన్, పి.సుబ్బయ్య, సుబ్బారావు, వి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'కుందూనదిపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు కోసం అక్షరాల రూ.564 కోట్లు కేటాయిస్తున్నాం. 8 టీఎంసీల నీటిని ఎస్‌ఆర్ 1 ద్వారా బ్రహ్మంసాగర్ జలాశయాన్ని నింపుతాం. దీనికింద 90 వేల ఎకరాలు సహా 72 చిన్న నీటి పారుదల చెరువుల కింద 35 వేల ఎకరాలు ఆయకట్టు స్థిరీకరిస్తున్నాం. మైదుకూరు, బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో లక్షలాది మందికి సురక్షిత తాగునీటి ఢోకా లేకుండా చేయబోతున్నాం. ఆర్టీపీపీకి కూడా 1.4 టీఎంసీల నీటిని పుష్కలంగా అందిం చవచ్చు.'



2019 డిసెంబరు 23న దువ్వూరు మండలం పెద్ద జొన్నవరం వద్ద శంకుస్థాపన జరిగిన రోజున సీఎం జగన్ అన్న మాటలవి...

'మైదుకూరు, బద్వేలు సస్యశ్యామ లం చేసేందుకు ఎంతో ఉన్నతాశయంతో సీఎం జగన్ ఎత్తిపోతల పథకానికి శంకు స్థాపన చేశారు. ఈ పనులను కచ్చితంగా నెల రోజు ల్లోపే ప్రారంభిస్తాం. వచ్చే మూడేళ్లలో పూర్తి చేసి రైతులకు రెండు కార్లకు నీళ్లివ్వడం, రైతులు సుఖ శాంతులతో ఉండేలా చేస్తాం.'



శంకుస్థాపన రోజున మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

ఎత్తిపోతలు.. వట్టి కోతలు

- మడమ తిప్పావ్ జగనన్నా ! ● కుందూ నుంచి తెలుగుగంగ ఎత్తి పోతలకు శంకుస్థాపనతోనే సరి
- రాజోలిదీ అదే దారి ● ఆయకట్టు లేదు.. తాగునీరు రాదు

'వట్టిమాటలు కట్టిపెట్టోయ్ గట్టిమేల్ తలపెట్టవోయ్' అంటూ జగన్ గట్టి మేలు కోసం ఎత్తిపోతల పథకం ఏర్పాటు కోసం తగినన్ని నిధులు కేటాయిస్తాం, వెంటనే పనులు ప్రారంభిస్తామని ప్రకటనలు చేశారు. అయితే ఇక్కడ ఎత్తిపోతల పథకం ఎత్తిపోయి జగన్ మడమ తిప్పడాన్ని స్పష్టంగా చూపిస్తోంది. కుందూనది నుంచి తెలుగుగంగకు ఎత్తిపోతల ప్రాజెక్టు ఏర్పాటు చేసి వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని చేసిన ప్రకటనలు సైతం మాటతప్పాయని శిలాఫలకాల రూపంలో జగన్‌ను వెక్కిరిస్తున్నాయి. 2019 డిసెంబరు 23న దువ్వూరు మండలం పెద్ద జొన్నవరం వద్ద ఎత్తిపోతలకు శంకుస్థాపన రోజున సీఎం జగన్, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేసిన ప్రకటనలు నీటి మూటలయ్యాయి. ఒకరు రాష్ట్రానికే సీఎం, మరొకరు మైదుకూరు నియోజకవర్గానికి బాస్ ఇలా ఇద్దరూ మాట ఇచ్చి మడమ తిప్పారు. వివరాల్లోకెళితే....




ఎత్తిపోతల పథకానికి కేటాయించిన స్థలం

మైదుకూరు, ఏప్రిల్ 24: దువ్వూరు మండలం పెద్ద జొన్నారం వద్ద కుందూ నది పై ఎత్తి పోతల పథకం ఏర్పాటు చేసి ఉంటే తెలుగుగంగ రెండు ఉప జలాశయాలు, బ్రహ్మంసాగర్‌లోనూ జలకళ ఉండేది. దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె వద్ద ఉన్న 1వ ఉప జలాశయంలో 2.133 టీఎంసీలు నీరు నిల్వ, మైదుకూరు మండలం గంజికుంట వద్ద ఉన్న 2వ జలాశయంలో 2.44 టీఎంసీల నీరు, బి. మఠం ఉద్ద బ్రహ్మంసాగర్‌లో 17.73 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశముంది. అయితే పాలకుల నిర్లక్ష్యంగా ఉపజలాశయాల్లో 0.2 నుంచి 0.5, బ్రహ్మంసాగర్‌లో 4 టీఎంసీల నీటి నిల్వ చేసుకోలేక పోతున్నాం. అదే ఎత్తి పోతల పథకం ఏర్పాటు చేసి ఉంటే నీటి నిల్వ పుష్కలంగా ఉండడంతో పాటు తాగు, సాగునీటికి ఢోకా ఉండేది కాదు. శంకు స్థాపన చేసి నాలుగున్నరేళ్లవుతున్నా ఇంత వరకూ ఆ పనులు ఊసే లేదు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు పనులు అప్పగించలేదు. అలాగే 48 ఎకరాలు భూసేకరణ చేయాల్సివుండగా అదీ స్థితీగతి లేకుండా పోయింది. సీఎం జగన్, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఇద్దరూ నియోజకవర్గ ప్రజలకు మాట ఇచ్చి తప్పారూ !

రాజోలి జలాశయందీ అదే దారి

2008 డిసెంబరు 23న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజోలి రిజర్వాయర్ నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ఆయన హయాంలో నిర్మించక పోవడంతో, అధికారం కోసం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం తిరిగి ఎత్తి పోతల పథకం శంకుస్థాపన రోజే రాజోలి ఆనకట్ట వద్ద జలాశయం నిర్మించేందుకు ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేశారు. ఇందు కోసం 1357.20 కోట్ల అంచనా వ్యయంతో 2.95 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. అయితే పదవీకాలం ముగుస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. శిలా పలకంలో మాత్రం 91 వేల ఆయకట్టు స్థిరీకరణకు 2.95 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజక్టు నిర్మించే విధంగా పేర్కొంది. కాని ఆ శిలా ఫలకం ఇప్పటికీ వెక్కిరిస్తోంది. జగనన్నా !



ఉపజలాశయం (ఫైల్ ఫొటో)



వెక్కిరిస్తున్న రాజోలి జలాశయం శిలాఫలకం



నాడు చెల్లని ఓట్లే.. ఇప్పుడు నోటా

మార్చనున్న అభ్యర్థుల తలరాతలు



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 24: ఈవీఎంలు రాకముందు బ్యాలెట్ పద్ధతి లో ఓటింగ్ జరిగేది. బ్యాలెట్ పేపరుపై ఉన్న గుర్తులను సరిగా చూసుకుని ఓట రు తన ఇష్టమైన గుర్తుపై ఓటు వేసేవారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్‌లో ఇబ్బంది లు వస్తున్నాయన్న ఉద్దేశంతో ఈవీఎంలను ప్రవేశపెట్టారు. నిరక్షరాస్యులు, వృద్ధులు బ్యాలెట్ పత్రంపై ఓటు వేసేసమయంలో అవగాహన లేని కారణంగా స్వస్తిక్ ముద్ర ను సరిగా వేసేవారు కాదు. దీంతో అలాంటి ఓట్లను చెల్లని ఓట్లుగా పరిగణించేవారు. ఈవీఎంలు వచ్చిన తరువాత అలాంటి సమస్య లేనప్పటికీ నోటా (పైవారిలో ఎవరూ కాదు) అనే ఆప్షన్ ఇచ్చారు. బ్యాలెట్ పత్రంపై తెలియక చెల్లని ఓట్లు పోల్ అయితే ఈవీఎంలలో అన్నీ తెలిసినా నోటా ఓట్లు పోల్ అవుతున్నాయి.

అవునా... ఎన్నికల గుర్తుల చరిత్ర ఇదీ !



మైదుకూరు, ఏప్రిల్ 24: భారత దేశంలో తొలి ఎన్నికల సమయానికి కేవలం అక్షరాస్యత 16 శాతమే ఉండేది. దీంతో ఓటర్లు పార్టీలను సులభంగా గుర్తించేందుకు వీలుగా గుర్తులు గీయించాలని సూచించడంతో 1950లో చిత్రకారుడు ఎంఎస్ సేథి పెన్సిల్‌తో పలు చిత్రాలను గీశారు. అలా నేటికీ పలు రకాలుగా ఆధునికతను సంతరించుకుని ఎన్నికల గుర్తులు రూపొందాయి. కాగా ఎంఎస్ సేథి 2000 సంవత్సరంలో కన్నుమూశారు.



తెలుసుకోండి... గతంలో 21 ఏళ్లకు ఓటు హక్కు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 24: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో ఏడు దశాబ్దాల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చింది. దేశంలో మొదట సాధారణ ఎన్నికలు 1952లో ఎన్నికల కమిషనరుగా సుకుమార్‌సైన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో 17.90 కోట్ల మంది ఓటర్లకు ఓటు హక్కు వేసే అవకాశం కల్పించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 1985 వరకు ఓటు హక్కు కనీస వయసు 21 ఏళ్లుగా ఉండేది. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి బాధ్యతలు స్వీకరించిన తరువాత 1988లో 61వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత 1990లో ఎన్నికల కమిషనరుగా బాధ్యతలు స్వీకరించిన టీఎన్ శేషన్‌కు దక్కుతుంది. 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 55 పార్టీలు బరిలో నిలవగా, 2014 నాటికి ఆ సంఖ్య 370కి చేరింది. ప్రస్తుతం బ్యాలెట్ పేపరుతో ఎన్నికలు నిర్వహించే విధానం నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం) వినియోగించే విధానాన్ని అమలు చేస్తున్నారు. 2019 నుంచి జరుగుతున్న ఎన్నికల నుంచి ఓటు ఎవరికి వేశారో తెలుసుకునేందుకు ఓటరు వెరిఫైడ్ పేపరు ఆడిట్ ట్రైల్ యంత్రాలను కూడా వినియోగిస్తున్నారు.

నాటే దిక్కయింది

మందుంటేనే ప్రచార హోరు
ప్రభుత్వ మద్యం అదనపు విక్రయాలన్నా నియోజకవర్గంలో నాటు జోరు

బద్వేలు, ఏప్రిల్ 24: క్వార్టర్ బాటిల్ వాటర్ ప్యాకెట్ ఈ రెండు ఉంటేనే ఎన్నికల ప్రచారంలో పదిమంది కనపడతారు. మద్యం బాటిల్ చేతికి ఇవ్వకుండా ప్రచారం చేయడం, వెంట తిప్పుకోవడం లాంటివి అంత సులభం కాదన్నది రాజకీయ సత్యం. ప్రస్తుతం మద్యం బాటిళ్లకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ ఎన్నికల వేళ 20 శాతం అదనంగా తాపిస్తున్నా ముందుకు డిమాండ్ పెరగడంతో నాటు సారా విక్రయాలు జోరందుకున్నాయి. ఓ వైపు ఎండలు మండుతున్నా మద్యం తాగాల్సిందే అనే మందు బాబులను స్థానిక నేతలు నాటుతో ముంచేస్తున్నారు. ప్రచారంతో సంబంధం లేని మందుబాబులు కూడా అవసరమైన మద్యం దొరక్క పోవడం, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రోజుకోరకం మద్యం బాటిళ్లు విక్రయిస్తుండడంతో దానికంటే నాటే బెటర్ అని నాటుసారాకు అలవాటు పడ్డారు. దీంతో నాటు సారాకు గిరాకీ పెరగడంతో సారా వ్యాపారులు ఎన్నికల సమయంలో మూడింతలు కాచి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.

లీటరు రూ.1500

బద్వేలు అసెంబ్లీ నియోజకవర్గంలో లీటరుకు నాటుసారా ఇప్పుడు వెయ్యి నుంచి రూ.1500 వరకు పలుకుతోందని సమాచారం. కాచే సారాటి బట్టి 1000, 1500 వరకు కూడా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఉంటే ఎన్నికల ప్రచారాలు మొదలు కావడంతో ప్రచారంలో పాల్గొనే వారు జెండాలు మోసేందుకు తీసుకువచ్చే జనాలకు మందు తప్పని సరిగా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల మందు రూ.300 నుంచి రూ.500 వరకు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. పట్టణాల్లో అయితే మద్యంషాపుల నుంచి క్వార్టర్ బాటిల్స్ సప్లై చేస్తారు. గ్రామాల్లో అయితే నాటు సారానే తాపిస్తారు. దీంతో నాటుకు గిరాకీ పెరిగింది. ఇదే అదునుగా నాటుసారా మూడు పూలు, ఆరు కాయలుగా విక్రయాలు జరుగుతున్నాయి. బద్వేలు, కాశినాయన, బి.కోడూరు, గోపవరం మండలాల్లో చాలా గ్రామాల్లో సారా తయారు చేసేవారున్నారు. వీరు కొండ ప్రాంతాల్లో దట్టంగా పెరిగిన తుమ్మవనాల్లో, వంకలు, వాగులు తోటలకు సమీపాల్లో కాలినడక అవసరమైన ప్రాంతాలకు తీసుకెళ్లి క్యాన్లతో విక్రయిస్తున్నట్లు సమాచారం.

ఈ విక్రయాలపై ఎక్సైజ్ పోలీసులు, ఎస్ఈబీ అధికారులు దృష్టి పెట్టకపోతే సాధారణ ఎన్నికల్లో నాటుసారా ఏరులై పారుతుంది. పొరపాటునో, గ్రహపాటునో నాటుసారా కాయ డంలో ఏవైనా పొరపాట్లు జరిగితే సారా తాగే వారి ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో నాటు సారా నిర్మూలనపై సంబంధిత అధికారులు ఏమేరకు దృష్టి పెడతారో వేచి చూడాలి.



నాటుసారా విక్రయాలు జరిపితే చర్యలు

నాటుసారా విక్రయాలు, బెల్టుషాపులు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. నాటుసారా కాపుపై ప్రత్యేక దృష్టిసారించామని నాటుసారా, బెల్టుషాలను నివారించేందుకు దాడులు నిర్వహిస్తున్నాం. ఇటీవల 100 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేశామని, నాటుసారా విక్రయించే ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎన్నికల సమయాల్లో నాటుసారాపై ప్రత్యేక దృష్టిసారించామని, నాటుసారా విక్రయిస్తే జైలుకు పంపుతామన్నారు. ఎవరైనా నాటుసారా విక్రయిస్తున్నా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా మాకు సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆమె తెలిపారు.

ఉల్లంఘనపై తెలపండి

ఎన్నికల పరిశీలకులు కునాల్ సిల్కు,భానుదాస్ పాలవె

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్లను మభ్యపెట్టే చర్యలు, ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించే అంశాలపై వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని ఎన్నికల పరిశీలకులు, ఐఏఎస్ అధికారులు కునాల్ సిల్కు, భానుదాస్ పాలవె బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ నిమిత్తం వారు జిల్లాకు చేరుకున్నారు. కడప పార్లమెంటరీ, కడప, పులివెందుల, కమలాపురం నియోజక వర్గాలకు కునాల్ సిల్కు జనరల్ పరిశీలకులుగా వచ్చారన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆయన సెల్ నెంబరు 9818140243కు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు నియోజక వర్గాలకు సాధారణ పరిశీలకులుగా భానుదాస్ పాలవె వ్యవహరించనున్నారు. ఆయన సెల్ నెంబరు 7350266713కు ఫిర్యాదులు చేయవచ్చన్నారు జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మద్యం, నగదు, బంగారం, ఇతర వస్తువులు, ఓటర్లను మభ్యపెడితే సమాచారం అందివ్వాలన్నారు.



కోడ్ ఉన్నా పంచాయతీరాజ్ దినోత్సవం



నివాళులర్పిస్తున్న సర్పంచు, కార్యదర్శి

పెండ్లిమర్రి, ఏప్రిల్ 24: ఓవైపున ఎన్నికల కోడ్ ఉన్నా పంచాయతీ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచులు బి.నాగమల్లారెడ్డి, బి.అంజలి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు. అయితే ఎన్నికల కోడ్ సందర్భంగా ఓటర్లు, ఇతరులు ప్రభావితమయ్యేలా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని నిబంధనలున్నా వాటిని కాలరాస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారా లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది.

అభిమానం....



కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డప్పగారి మాధవి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఇద్దరు యువకులు గుండు చేయించుకుని గుండు పై ఓట్ ఫర్ సైకిల్, మాధవిరెడ్డి అని రాయించుకుని నగరంలో తిరిగారు.

మే 13న ఓటింగ్ రోజు

13 రకాల కార్డుల్లో ఏది ఉన్నా ఓటు వేయవచ్చు
ఓటరూ గుర్తుంచుకో.... మంచి పాలనలో భాగస్వాములవండి

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 24: కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్ నాయక్ 2024 మే 13న శెలవు రోజని ప్రకటించారు. అంటే ఆరోజు ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనేందుకు వీలుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, దుకాణాలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందన్నారు. అయితే ఆ రోజు శెలవు దినం కాదు ఓటింగ్‌లో పాల్గొనే రోజుగా గుర్తుంచుకోవాలి. ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఓటరు తమ అమూల్యమైన ఓటును మంచి పాలకులకు వేసి, సుపరి పాలనకు నాంది పలకాలి. భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించింది. ఇంతటి ప్రాధాన్యత గల ఓటు హక్కును నిర్లక్ష్యంతో వినియోగించుకోక పోతుంటారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉన్నా ఓటరు తమ ఓటును వినియోగించుకోవచ్చు. ఓటు వజ్రాయుధమని చాటేందుకు ప్రతి ఓటరూ విధిగా తమ హక్కును వినియోగించుకోవాలి. పోలింగ్ కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఎన్నికల నిర్వహణ అధికారులు అనుమతించరు. వివిధ కారణాలు చూపుతూ ఓటు వేసేందుకు ససేమీరా అనేవారు దాదాపు 5 నుంచి 10 శాతం మంది ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటి ఓటర్లపై ఈ దఫా ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి పెడితే పోలింగ్ శాతం మరింత పెంచవచ్చు. ఓటింగ్ పక్రియ జరిగే రోజున పోలింగ్ స్టేషన్ గుర్తించడానికి ఓటర్లు ఈసిఐ.జివోవి.ఇన్ వెబ్ సైట్‌లో తెలుసు కోవచ్చు లేదా ఓటరు హెల్ప్‌లైన్ నెంబరు 1950, ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా పోలింగ్ కేంద్రాల వివరాలను పొందవచ్చు.

ఓటు వేయాలంటే ఈ గుర్తింపు పత్రాలు ఉండాల్సిందే

- ఓటరు గుర్తింపు కార్డు
- ఆధార్ కార్డు
- పాన్ కార్డు
- ప్రత్యేక వైకల్యం ఐడీకార్డు
- సేవా గుర్తింపు కార్డు
- బ్యాంకు, పోస్టాఫీసు పాస్ బుక్‌లు
- ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు,
- డ్రైవింగ్ లైసెన్స్
- పాస్‌పోర్ట్
- ఎన్‌పీఆర్ కింద ఆర్జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు
- పెన్షన్ డాక్యుమెంట్స్
- ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల ఎన్నికలకు అధికారులు జారీ చేసిన ప్రత్యేక గుర్తింపు కార్డులు
- ఉపాధి హామీ జాబ్ కార్డు

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సిద్ధం

- ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తా
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు
- పసుపుమయమైన కడప నగరం
- అట్టహాసంగా మాధవీరెడ్డి నామినేషన్ పర్వం
- జనసంద్రంగా మారిన పచ్చదండు


మాట్లాడుతున్న మాధవీరెడ్డి, చిత్రంలో శ్రీనివాసరెడ్డి, అమీర్‌బాబు, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి తదితరులు


ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు


ఉత్సాహంగా.. ఉల్లాసంగా టీడీపీ శ్రేణులు


ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ క్రిష్ణకిశోర్


చూపరులను అబ్బురపరచిన టీడీపీ అభిమాని విన్యాసం

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 24 : కడప నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి మనసా వాచా, కర్మణా సిద్ధంగా ఉన్నానని కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పేర్కొన్నారు. కడప నియోజకవర్గ శాసనసభ్యురాలిగా విజయం సాధించి పార్టీ అధినేత చంద్రబాబుకు బహుమతిగా సమర్పిస్తామని స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమి కడప అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి రెడ్డప్పగారి మాధవీరెడ్డి నామినేషన్ బుధవారం జన ప్రభంజనంగా మారింది. కడపనగరం ఎటు చూసినా పసుపుమయమైంది.ద్వారకానగర్ నుంచి పెద్దఎత్తున ర్యాలీ ప్రారంభమై సంధ్యా సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా మాధవీరెడ్డి మాట్లాడుతూ కడప అభివృద్ధే తన లక్ష్యమని, గెలిచిన వెంటనే మహిళా దర్బారు ఏర్పాటు చేసి మహిళలకు అండగా ఉంటామన్నారు. కడప నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులను గుర్తించి పథకాలు చేరవేస్తామన్నారు. సొంత నిధులతో అనుకోకుండా జరిగే ప్రమాదాల ద్వారా ఇంటి పెద్ద చనిపోతే అలాంటి కుటుంబాల భవిష్యత్తుకు రక్షణ కల్పిస్తామన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంత డబ్బుతో ఐదులక్షల బీమా చేయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగంలో మన రాష్ట్రం దేశంలోనే మొదటిస్థానంలో ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగం సాధించేంత వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు అందిస్తామన్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులు, కొత్త పరిశ్రమల స్థాపనకు కృషి చేసి ఐదేళ్లలో పదివేల మంది స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వ్యాపారాల్లో రాణించాలనుకునే యువతను ప్రోత్సహించి ఎంఎస్ఎంఈ మేనిఫ్యాక్చర్ యూనిట్లు ఏర్పాటు చేయించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామన్నారు. యువతకు రుణాలు ఇచ్చి స్వయం ఉపాధి మార్గాలు కల్పిస్తామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా కొత్తరోడ్లు వేస్తామన్నారు. రవాణా సదుపాయాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎమ్మెల్యే తిన్నదంతా కక్కించి నష్టపోయిన వారికి న్యాయం చేస్తామన్నారు. యువతను పెడదోవ పట్టిస్తున్న గంజాయిలాంటి మాదకద్రవ్యాలను కడప నుంచి తరిమికొట్టి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అణచివేస్తామన్నారు. కడప ప్రజలు పూర్తి శాంతియుత వాతావరణంలో జీవించేలా చర్యలు చేపడతామన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో భూకబ్జాలు, ఆక్రమణలు, పోలీసుస్టేషన్లలో సెటిల్‌మెంట్లు ఎక్కువయ్యాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలేసి స్వార్థ ప్రయోజనాల కోసమే ఐదేళ్లపాలన సాగించారని విమర్శించారు. ప్రజాబలం ముందు అంజద్‌బాషా ఎన్నికల్లో నిలువలేరని, ఆయన మూడోస్థానానికి చే రుకుంటారన్నారు. ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మాధవీరెడ్డి ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలు అందించి నామినేషన్ దాఖలు చేశారు.


ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

పసుపుమయమైన కడప నగరం

ఎన్డీఏ కూటమి కడప అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో కడప నగరం పసుపుమయమైంది. ఎటు చూసినా పసుపు దండు కనిపించింది. రోడ్లన్నీ పూలతో నిండాయి.

కనువిందు చేసిన కేరళ వాయిద్యాలు

మాధవీరెడ్డి నామినేషన్ ర్యాలీలో కేరళవాయిద్యాలు కనువిందు చేశాయి. టీడీపీ శ్రేణులు కేరింతలు, జయ జయధ్వానాలతో ప్రాంగణమంతా మార్మోగింది.

గగుర్పొడిచే యువత విన్యాసాలు

కడప నగరం మాసాపేటకు చెందిన యువత చేసిన విన్యాసాలు గగుర్పొడిచే విధంగా ఉన్నాయి. కర్రసాము, అగ్గి విన్యాసాలు చేసి ప్రజలను ఆనందభరితులను చేశారు.

మహిళల నృత్యాలు

టీడీపీ మహిళా శ్రేణులు ఆనందంతో డ్యాన్సులు వేస్తూ చిందులు వేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.గోవర్ధన రెడ్డి, సుధా దుర్గాప్రసాద్, అలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి, అమీర్‌బాబు, హరిప్రసాద్, రవిశంకర్‌రెడ్డి, వికాస్‌హరిక్రిష్ణ, శివకొండారెడ్డి, ఎద్దుల శంకర్, దేవునికడప సాయి, బీజేపీ నాయకులు సింగారెడ్డి రామచంద్రారెడ్డి, జనసేన నాయకుడు తుంగా రమణయ్య, టీడీపీ మీ డియా కోఆర్డినేటరు జనార్ధన్, యాటగిరి రాంప్రసాద్, వల్లూరు రవిశంకరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో...

ర్యాలీలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి నాయకత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు చెన్నకేశవ రెడ్డి, గోపి, చరణ్, అలీ, ప్రతాప్, చందు పాల్గొన్నారు.

పవన్‌కుమార్ (చిరంజీవి) ఆధ్వర్యంలో...

కడపనగరం సాయిపేట మాజీ కార్పొరేటరు సుగవాసి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు.స్థానిక నాయకులురాజు వెంకటసుబ్బారెడ్డి, సుగవాసి యువరాజ్ తదితరులు పాల్గన్నారు.

తుంగా రమణయ్య ఆధ్వర్యంలో...

కడప నగరం జనసేన రాష్ట్ర నాయకులు తుంగా రమణయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎద్దుల శంకర్ ఆధ్వర్యంలో...

కడప నగరం దేవునికడప వెంకటేశ్వరస్వామి దర్శనానంతరం ఎద్దుల శంకర్ ఆధ్వర్యంలో మాధవీరెడ్డి దంపతులకు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాయి తదితరులు పాల్గొన్నారు.

వికాస్‌హరి ఆధ్వర్యంలో...

కడప నగరం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 45వ డివిజను స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో...

మాధవీరెడ్డి నామినేషన్ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున విద్యార్థులు, యువత ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు యువత తమ ప్రథమ ఓటు టీడీపీకే అని నినాదాలు చేశారు.


ర్యాలీలో సుగవాసి పవన్‌కుమార్(చిరంజీవి), రాజు వెంకటసుబ్బారెడ్డి, సుగవాసి యువరాజ్




జనసేన నాయకుడు తుంగా రమణయ్య ఆధ్వర్యంలో ర్యాలీ


కేరళ డప్పు వాయిద్యాల సందడి


దేవునికడపలో గజమాలతో సత్కరిస్తున్న ఎద్దుల శంకర్, సాయి


ర్యాలీలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ


మాధవీరెడ్డితో సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి

12 నామినేషన్లు దాఖలు

పులివెందుల, ఏప్రిల్ 24: పులివెందుల అసెంబ్లీ స్థానానికి బుధవారం 12నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశులు తెలిపారు. టీడీపీ తరపున మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, తనయుడు మారెడ్డి రామ్‌రెడ్డి ఇరువురు నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు స్వతంత్ర్య అభ్యర్థిగా వెంకట లక్ష్మిరెడ్డి, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ తరపున చిన్న ఎరికల రెడ్డి, బీఎస్పీ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జన సహాయక శక్తి పార్టీ తరపున పుష్పనాథరెడ్డి, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ తరపున విజయ్‌కుమార్‌రెడ్డి, సూపర్ రేంజర్స్ పార్టీ తరపున సర్వోతమరెడ్డి, ర్యాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కరిస్ట్) పార్టీ తరపున రవితేజరెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా రాఘవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ తరపున ధ్రువకుమార్‌రెడ్డి, రాష్ట్రీయ జనతా దల్ పార్టీ తరపున లింగాల రామలింగారెడ్డిలు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

పులివెందులలో ప్రజాస్వామ్య పరిరక్షణకు దేనికైనా సిద్ధం

- పులివెందుల ప్రజలు మంచీచెడు ఆలోచించి ఓటు వేయాలి: బీటెక్ రవి
- పంటల బీమా లేదు, డ్రిప్పు లేదు, అన్నింటినీ మూలన పడేశారు: పార్లమెంట్ అభ్యర్థి భూపేష్

పులివెందుల, ఏప్రిల్ 24: పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దేనికైనా సిద్ధమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. బుధవారం పులివెందుల అసెంబ్లీ స్థానానికి బీటెక్ రవి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశులుకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందులలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వందశాతం కృషిచేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతకైనా తెగిస్తామన్నారు. ప్రజలు ఇంతకాలం ఎన్నో ఘోరాలను, అవమానాలను చవిచూశారన్నారు.

ఉద్యోగ కల్పనలో వైసీపీ విఫలం: భూపేష్‌రెడ్డి

కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక ఎంపీగా ఉన్న అవినాష్ రెడ్డి ఆయన పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఐదేళ్ల తర్వాత వచ్చి ధనం ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు డబ్బు పంచుతున్నారన్నారు. పులివెందుల ప్రజలు మంచీచెడు ఆలోచించి ఓటు వేయాలన్నారు. 2019 మార్చి 15వ తేదీ ఏం జరిగిందో అందరికి తెలుసన్నారు. చేసింది ఒకరైతే చంద్రబాబునాయుడు, బీటెక్ రవికి పాపం తగిలించాలని చూశారన్నారు. వారిపై నిందారోపణలు మోపి ఓట్లు దండుకున్నారన్నారు. ప్రజలందరికి మంచి చేసిన వ్యక్తి వివేకానందరెడ్డి అన్నారు. ఎన్నికలకు ఆ రు నెలల ముందు స్టీల్‌ప్లాట్‌కు శంకుస్థాపన చేశారని వైసీపీ హేళన చేసిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే శంకుస్థాపన చేసి నువ్వేం సాధించారని ఆయన ప్రశ్నించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పులివెందులలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

పులివెందులలో టీడీపీ భారీ ర్యాలీ

పులివెందులలో బీటెక్ రవి నామినేషన్ సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కార్యాలయం నుంచి పార్నపల్లె రింగురోడ్డు, పూలంగళ్ల, బోలేవార్డు, తొలగించిన బస్టాండ్ మీ దుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీటెక్ రవి వాహనం నుంచి అభివాదం చేస్తూ కార్యాలయానికి చేరుకున్నారు.

పది పరీక్షల పారితోషికం వెంటనే చెల్లించాలి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 24 : పదో తరగతి పరీక్షలు 2024కు సంబంధించి నిర్వహించిన మూల్యాంకన పారితోషికం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో పరిపాలనాధికారి మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి టపాసులు పేల్చిన ఇరువర్గాలపై కేసు నమోదు

కడప(క్రైం), ఏప్రిల్ 24: కడప నగరంలో బుధవారం నామినేషన్ వే సేందుకు టీడీపీ నేతలు, మరో వైపు వైసీపీ నేతలు భారీగా ర్యాలీ ని ర్వహించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి మాధవిరెడ్డి వర్గం వారు కోటిరెడ్డి సర్కిల్ వద్ద బాణాసంచా పేల్చడంతో వారిపై కేసు నమోదు చేశామని, అలాగే డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైసీపీ తరఫున నామినేషన్ వేసేందుకు తమ సోదరుడు అహ్మద్‌బాషాతో కలిసి పెద్ద ఎత్తున అభిమానులతో ర్యాలీగా బయలుదేరారు. ప్రధాన పోస్టు ఆఫీసు వద్దకు రాగానే టపాసులు పేల్చడంతో ఇరువర్గాలపై ఎన్నికల నిబంధనలు పాటించకపోవడంతో కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 110 కుటుంబాలు చేరిక


టీడీపీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి

పెండ్లిమర్రి, ఏప్రిల్ 24: మండలంలోని పాత సంగటిపల్లె, దాసరిపల్లె, మొయిళ్ల కాల్వ, ఏరాసుపల్లె, పెండ్లిమర్రి గ్రామాలలో బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో బుధవారం 110 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి పుత్తా నరసింహారెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎక్కడ అభివృద్ధి జరగలేదన్నారు. ఇక్కడ చూసిన ఇసుక, గ్రావెల్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయన్నారు. రైతులకు డ్రిప్పు పరికరాలు, వ్యవసాయ పరికరాలు ఈ ఐదేళ్ల పాలనలో ఇచ్చిన పాపానపోలేదన్నారు. రైతు రాజ్యం రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఆ ఉద్దేశంతో టీడీపీలో చేరామన్నారు. టీడీపీకి మెజార్టీ వచ్చేలా కృషిచేస్తామన్నారు. అనంతరం పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, మండల టీడీపీ నేతలు ఆరవేటి చంద్రారెడ్డి, రఘు, నాగమల్లారెడ్డి, సారథి, నారాయణరెడ్డి, అన్నమయ్య, చెంద్రాయుడు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి చంద్ర ఓబుళరెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధి టీడీపీకే సాధ్యం: పుత్తా

వల్లూరు, ఏప్రిల్ 24 : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేతల కోసం, రైతుల సంక్షేమం కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేశాడని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం దుగ్గాయపల్లె, పెద్దపుత్త గ్రామాల్లో యువనేత క్రిష్ణచైతన్యరెడ్డి, సాయినరసింహారెడ్డి కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులకు గత ప్రభుత్వంలో అందించిన పథకాల గురించి వివరించారు. వీరి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డితో పాటు తాడిగొట్ల రాఘవరెడ్డి, పుత్తా బాలిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, శివారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, చంద్రశేకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సూర్యసుబ్బారెడ్డి, ఎం.లక్షుమయ్య గంగరాజు, నరేశ్, ఓబయ్యతో పాటు పెద్దఎత్తున పుత్తా అనుచరులు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి

సీకేదిన్నె, ఏప్రిల్ 24: తెలుగుదేశం పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అల్లుడు యశ్వంత్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి పంచాయతీ ఎర్రమాచుపల్లె గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి టీడీపీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, క్రిష్ణకిశోర్ రెడ్డి, మోహన్‌బాబు, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే మైనార్టీల అభివృద్ధి

చెన్నూరు, ఏప్రిల్ 24:రాష్ట్రంలో మైనార్టీలకు పెద్దపీట వేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సతీమణి పుత్తా శ్రీచైతన్య పిలుపునిచ్చారు. బుధవారం చెన్నూరు మైనార్టీ కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే సంక్షేమం, అభివృద్ధికి మారుపేరు అన్నారు. అలాంటి నేత సీఎం అయితే అందరూ బాగుపడతారన్నారు. మైనార్టీ నేతలు షబ్బీర్ హుసేన్, ఖాజాహుసేన్, షఫి, జిలానీ, మంజూరు అహ్మద్ సుభాని, గౌస్‌పీర్, ఖాజా,తవ్వ షబ్బీర్, ఇన్సాద్, కువైట్ ఖాదర్, నాగూర్, మండల కన్వీనరు కెవిజయభాస్కర్‌రెడ్డి, జిల్లా టీడీపీ కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'వైసీపీ వారికే కండువాలు కప్పడం వారి నైజం'

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 24: గతంలో వైసీపీలో ఉన్న వారే మళ్లీ కండువాలు కప్పించుకోవడం వైసీపీ నైజమని మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీ ప్రసాద్‌రెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సంగమేశ్వర ఆలయ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, ఎస్ఆర్‌పేట జనార్దన్‌రెడ్డి, గుర్రప్పయాదవ్ ఆరోపించారు. బుధవారం వారు టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించారన్నారు. ఆపర్యటనలో వైసీపీలో ఉన్న వారికే కండువాలు వేసి 120 కుటుంబాలు టీడీపీ నుంచి వైసీపీలో చేరాయని పత్రికల్లో రాయించుకోవడం హాస్యాస్పదమన్నారు.

ఇంటింటి ప్రచారంలో విజయజ్యోతి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 24 : బద్వేలు నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే తనకు ఒకసారి అవకాశమివ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్‌డీ విజయజ్యోతి అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా పోరుమామిళ్లలోని అమ్మవారిశాలవీధి, ముస్లిం కోట, కొలిమిప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అన్వర్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీయం పార్టీ మండల కార్యదర్శి భైరవ ప్రసాద్, సీపీఐ నాయకులు కేశవ, నాయకులు బండి బాలసుబ్బయ్య, చిన్నరామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

లక్షరూపాయల వితరణ

కాశినాయన ఏప్రిల్ 24: ఓబుళాపురం సమీపంలోని నగిలేరు ఒడ్డునఉన్న వివేకానంద సేవాశ్రమానికి బుధవారం కడప నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చల్లా వీరరాఘవరెడ్డి రూ.1లక్ష విరాళంగా అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు రామక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆయన తల్లి పద్మావతి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆశ్రమాన్ని సందర్శించి పద్మావతి శిలాఫలకాన్ని ఆవిష్కరించి ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ సభ్యుడిగా ఉండి ఆశ్రమానికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd Proddatur branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Devaki Ravi Kumar Gupta** S/o Narasimhaiah Gupta r/o at Dno:2/936 Hari Rao Street Kadapa kadapa dist by mortgage. As such if anyone has any claims ,objections charges or mortgages sale agreements , court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SHEDULE OF THE PROPERTIES :** Kadapa dist Kadapa Urban Sub dist ,Kadapa town Kadapa Muncipal Corporation Area 35th ward Ukkayapalli Village Field, SY No:493/1 Plot No:6,7,8,9,10 an Extent of Ac 0.34.636 Cents out of Vacancite Total Extent Ac 0.29 Cents 659 Sq Links or 1435.49 Yards with in the following **Boundaries** : EAST : Panta Kaluva After Site of Mopuru Naga-subbareddy, WEST : Hemanth Site And Road, NORTH : Way To Road Plots, SOUTH : Plot no 11 Obanna House

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

PUBLIC NOTICE

I am instructed by my client from M/s Shriram Finance Ltd., Badvel Branch, Rep. by the Branch Manager to publish this notice as follows :
Sri **(1) Muthyala Pedda Anki Reddy** S/o Late Chinna Veerareddy, r/o D.No. 3-79, Sanivireddipalli village and Post, Komarolu Mandal, Prakasam District and **(2) Maramreddy Veeramohan Reddy** S/o Rama Narayana Reddy, r/o Yerrapalli Village, Komarolu Mandal, Prakasam District has applied for loan by offering the below mentioned property as security. On scrutinizing the documents over the property, my client Firm decided to grant loan to the applicant named above. Hence if anybody has got any objection/ any right over the property and if any litigations are prending in the Court of Law over the property, it shall be brought to my clients notice with documentary proof, else, it will be proceed further in the matter. If any such objections received after five days they will not be taken into account.
Particulars of Property : Kadapa District, Badvel Sub-District, Proddatur Registration District, Porumamilla Mandal, Porumamilla Village Fields Suvey No. 4, Ac. 0.17 cents or 0.0658 Hectors out of Ac. 0.34 cents located at distance to a door no. 14/400 or Porumamilla Grama Panchayat, in the below **Boundaries :** East - Land of Pothireddy Krishnamma sons, South - Government Irrigation Canal, West - Land of Muthumala Venkata Rami Reddy in the same Sy. Number, North-Land of Pothireddy Krishnamma and Konda Narasimha Reddy- with in the above boundaries Ac. 0.17 cents or 822.8 Sq. Yards.

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

PUBLIC NOTICE

On instructions of my client firm the Branch Manager M/s Shriram Finance Ltd., Kadapa-1 Branch I issue the notice to the public as follows **smt. Peerla Nasein** w/o Mahaboob Basha, Chintakunta Village, Duvvur Mandal, Kadapa Dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc., shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice, otherwise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTIES :** YSR Kadapa District, Proddatur Sub-district, Proddatur Town Municipality, Srinivasa Nagar Area, Swarajya Nagar Area, Ward No. 7, the half completed house without d.no. with RCC roof is situated in Sy.No. 586 to an extent of 96.8 square yards is bounded as follows : EAST: Vacant site of B.Subbarayudu, WEST : Ramaiah Swamy Mattam, NORTH: Vacant site of T. Atzal SOUTH : Vacant site of R.T.C. Dastagiri. Measurements of Vacant site : East-West : on north side 78 1/4 links or 15.728 meters, on south side 77 3/4 links or 15.565 meters, North-South : 25 links or 5.125 meters. Measurements of half completed house : East-West : 39 feet or 11.887 meters, North - South : 16 links or 4.76 meters

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

PUBLIC NOTICE

I am instructed by my client from M/s Shriram Finance Ltd., Badvel Branch, Rep. by the Branch Manager to publish this notice as follows : Sri **Muddam Madhavi** W/o Late Chemuduru Venu Gopal, d/o Muddam Chinna Nagaiah r/o D.No. 2/83, Muddan-avari Palli village, Porumamilla Mandal Kadapa District has applied for loan by offering the below mentioned property as security. On scrutinizing the documents over the property, my client Firm decided to grant loan to the applicant named above. Hence if anybody has got any objection/ any right over the property and if any litigations are prending in the Court of Law over the property, it shall be brought to my clients notice with documentary proof, else, it will be proceed further in the matter. If any such objections received after five days they will not be taken into account.
Particulars of Property : Kadapa District, Badvel Sub-District, Proddatur Registration District, Porumamilla Mandal, Rangasamudram Panchayat, Rangasamudram Village Fields Sy. No. 172, site of 161.88 Sq. Yards out of Ac. 5.30 cents located near door no. 4/68 of Kamavaripalli Weaker Section area, in the below **Boundaries :** East - Room of Kalavakuri Pedda Venkata Subba-iah, South - Site of Medical Store Ravi, West - Road of 16 Feet width in the same Survey Number, North - Site of Mahanandipalli Venkata Subbaiah (Arm), Measurements : East-West : 74.3 Feet (22.53 Mtrs) North - South : 19.6 Feet (5.94 Mtrs) - Totaling to 161.88 Sq. yards with all easementary rights

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

బడుగుల అభ్యున్నతి బాబుతోనే సాధ్యం

మైదుకూరు, ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పుట్టా సుధాకర్‌యాదవ్, వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరిక




ఖాజీపేట... పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన నాగసానిపల్లె గ్రామస్థులు, ప్రొద్దుటూరులో వరద సమక్షంలో టీడీపీలో చేరిన ఆటో కార్మికులు

ఖాజీపేట, ఏప్రిల్ 24: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల వారు అభ్యున్నతి చెందాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టాసుధాకర్‌యాదవ్ అన్నారు. బుధవారం పుట్టా సుధాకర్‌యాదవ్ స్వగృహంలో మండల పరిధిలోని సుంకేసుల హరిజనవాడకు చెందిన నరసింహులు, వాసు, నవీన్, చిన్నయ్య, అల్లూరమ్మ, అంజనమ్మ, కొండమ్మ, రామసుబ్బమ్మ అనుచర వర్గం దాదాపు 80 కుటుంబాలు క్రిష్ణచైతన్యరెడ్డి ఆధ్వర్యంలో, అలాగే నాగసానిపల్లెకు చెందిన ఎంపీటీసీ శ్రీదేవి, మల్లికార్జున, అయ్యవారు, శ్రీనివాసులు, నవీన్, లక్షుమయ్య, అనుచర వర్గం దాదాపు 70 కుటుంబాలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి, మాజీ జడ్పీటీసీ గోవిందురెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, వెంకటస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని కుచ్చుపాప గ్రామంలో బుధవారం రాత్రి వైసీపీకి చెందిన బడుగు వెంకటేష్ ఆధ్వర్యంలో 30 వైసీపీ కుటుంబాలవారు టీడీపీలో చేరారు. మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుధాకర్‌యాదవ్ ఇంటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు గురివిరెడ్డి, పసల రమణ, ఓబులేసు, గోర్ల పెద్దసుబ్బరాయుడు, శ్రీనివాసులు, రవీంద్ర, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

మైదుకూరు..: మండలంలోని మిట్టమానుపల్లె, కేశాపురానికి చెందిన వైసీపీ నాయకులు పలువురు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం మైదుకూరులోని టీడీపీ కార్యాలయానికి ఆయా గ్రామాలకు చెందిన చాగంరెడ్డి రమణా రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఈశ్వరరెడ్డి, మిట్టమానుపల్లెకు చెందిన మూలే శంకర్‌రెడ్డిల అనుచరులకు చెందిన దాదాపు 60 కుటుంబాల వారు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీరెడ్డి, రామమోహన్‌రెడ్డి, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: పదేళ్ళు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి సహకరించినా ఆటోడ్రైవర్లకు మేలు చేయలేదని వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఆటో డ్రైవర్స్ అండ్‌వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చెంద్రాయుడు, కార్యదర్శి గురుమూర్తి కోశాధికారి జయరామిరెడ్డి ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి వరద రాజులరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ అనుబంధ ఆటో యూనియన్‌కు చెందిన దాదాపు 200 మంది ఆటో కార్మికులు టీడీపీలో చేరారు. వీరందరికీ వరద రాజులరెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ మున్సిపల్ చైర్మెన్ వీఎస్ ముక్తియార్, కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి, మురళీధర్‌రెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, చల్లా రాజగోపాల్ యాదవ్, నల్లబోతుల నాగరాజు, ఖలీల్,వెల్లాల భాస్కర్ పాల్గొన్నారు.

నేటి నుంచి అంకాళమ్మ తిరుణాళ్ల

ఖాజీపేట, ఏప్రిల్ 24: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అంకాలమ్మ తిరుణాళ్ల గురువారం నుంచి ప్రారంభం కానుంది. మండల పరిధిలోని దుంపలగట్టు సమీపంలో వెలసిన అంకాలమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చుతుండడంతో జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి దర్శించుకుంటారు. ఈ తిరునాళ్ల నాలుగు రోజులపాటు నిర్వహించి ఆదివారం ముగియనున్నది. వేసవి కాలం కావడంతో అమ్మవారికి దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ తెలిపారు.

పలువురు ఎన్డీయేలో చేరిక



ఎన్డీయే కూటమిలో చేరిన దృశ్యం

కొండాపురం, ఏప్రిల్ 24: మండలంలోని పి.అనంతపురం గ్రామంలో బుధవారం మండల బీజేపీ ఇన్‌చార్జి శివనారాయణరెడి ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమిలో చేరారు.కండువాలు కప్పి వారిని ఎన్డీయేలో కూటమిలోకి ఆహ్వానించారు.రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి,కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డిల గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. పి.అనంతపురం గ్రామానికి చెందిన అంచల జనార్దన్‌రెడ్డి,అంచల శివనారాయణరెడ్డి,అంచల రామనాథరెడ్డి,విశ్వనాథ్‌రెడ్డి తదితర కుటుంబాలు ఎన్డీయే కూటమిలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడు నామినేషన్లు దాఖలు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నర్రెడ్డి తులసిరెడ్డి, పాముల బ్రహ్మానందరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 24: జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ఏడు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరుపున అసెంబ్లీకి పాముల బ్రహ్మానందరెడ్డి ఆయన వెంట నర్రెడ్డి తులసిరెడ్డి నామినేషన్ పత్రాలు అందజేశారు. బీజేపీ తరుపున చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి మూడో సెట్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా మూలింటి క్రిష్ణతేజ, సింగంరెడ్డి శివసుబ్బారెడ్డి, జై భారత్ నేషనల్ పార్టీ తరుపున దంపెర్ల శ్రీనివాసులు, సమాజ్‌వాజ్ పార్టీ తరుపున ఎద్దుల రమేష్, పిరమిడ్ పార్టీ తరుపు ముద్రబోయిన నాగభూషణం నామినేషన్లు దాఖలైనట్లు వారు తెలిపారు.

మైదుకూరులోనూ 7...

మైదుకూరు, ఏప్రిల్ 24 : మైదుకూరు నియోజకవర్గం నుంచి శాసనసభకు ఏడుగురు అభ్యర్థులు బుధవారం నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ తరుపున ఆయన పీఏ హరి రెండో సెట్టును దాఖలు చేయగా, పుట్టా రవికుమార్ యాదవ్ తరుపున రెండో సెట్టుగా రాకెట్ రఫీ దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుండ్లకుంట శ్రీరాములు,స్వతంత్ర అభ్యర్థిగా శ్రీయపురెడ్డి శివరామ క్రిష్ణారెడ్డి, మహాజన రాజ్యం పార్టీ అభ్యర్థిగా ఎల్లుగాళ్ళ రాజేష్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మహబూబ్‌బాష, జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక అభ్యర్థిగా మీసాల నాగమునెయ్య తమ నామినేషన్లను దాఖలు చేసినట్లు ఆర్వో చంద్రమోహన్ తెలిపారు.

ప్రొద్దుటూరులో 9...

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నామినేషన్ల దాఖలు ప్రక్రియ కొనసాగుతోంది. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో తొమ్మిది మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్‌వో కౌసర్ బాను తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా నాయబ్‌గారి షేక్‌గపార్, ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి సతీమణి రాచమల్లు రమాదేవి(స్వతంత్ర అభ్యర్థి), రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి (వైసీపీ అభ్యర్థి) ,పల్లేటి చంద్రప్రభాకర్‌రెడ్డి (స్వతంత్ర అభ్యర్థి) ,ఖాదర్‌బాషా, చాగలమర్రి షేక్ (స్వతంత్ర అభ్యర్థి)షేక్ మహ్మద్ రఫీ (నవరంగ కాంగ్రెస్‌పార్టీ),పోతుగంటి మహ్మద్ రఫీ (జై భారత్ నేషనల్ పార్టీ),తనగాని కరుణాకర్ యాదవ్ (జైభీమ్‌రావు భారత్ పార్టీ), మల్లెపూల తులసి (స్వతంత్ర అభ్యర్థి) నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. 25వ తేదీ నామినేషన్లకు చివరి రోజు అని అభ్యర్థులు ఎవ్వరైనా సాయంత్రం 3 గంటల లోపు నామినేషన్లు దాఖలుచేయాలని ఆతరువాత స్వీకరించబడవని ఆర్‌వో తెలిపారు.

ఆర్వో కార్యాలయం పరిశీలన

మైదుకూరు, ఏప్రిల్ 24 : జోన్ ఎన్నికల పరిశీలకుడు భానుదాస్‌పల్వీ బుధవారం సాయంత్రం మైదుకూరులోని ఆర్వో కార్యాలయాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన నామినేషన్ల వివరాలతో పాటు నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక కేంద్రాలపై రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌కు ఎటువంటి అవాంతరాలు జరుగకుండా గట్టి భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈయన మైదుకూరు, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాలకు ప్రత్యేక పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు.

మెరుగైన సేవలందించడమే ఏపీజీబీ లక్ష్యం

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 24 : మండలంలోని ఏపీజీబీ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ఏపీజీబీ లక్ష్యమని ఛైర్మన్ రాకేశ్ తెలిపారు. బుధవారం స్థానిక ఏపీజీబీని సందర్శించి అనంతరం కాలజ్ఞాన కర్త బ్రహ్మంగారిని దర్శించుకున్నారు. రానున్న రోజుల్లో ఏపీజీబీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే రైతులు, ప్రజలకు తక్కువ వడ్డీతో బ్యాంకుల్లో రుణాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజరు సుశాంత్ కుమార్, బి.మఠం బ్రాంచ్ మేనేజరు ఆదిత్య, బ్యాంకు సిబ్బంది ప్రతాప్, రాము, మఠం మేనేజరు ఈశ్వరయ్యాచారి, ఫిట్ పర్సన్ శంకరబాలాజీ పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి : భూపేశ్



ప్రచారం నిర్వహిస్తున్న భూపేశ్

కొండాపురం, ఏప్రిల్ 24 : చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎన్డీయే కూటమి కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి తెలిపారు.బుధవారం ఆయన మండలంలోని ఎనమలచింతల,చవ్వనాగయ్యపల్లె గ్రామాలలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.ఎన్డీయే కూటమి తరపున జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న తన బాబాయి ఆదినారాయణరెడ్డిని, కడప ఎంపీ గా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి, కూటమి నాయకులు గండ్లూరు నాగేశ్వరరెడ్డి,యనమలచింతల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్‌ను గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న పుట్టా ఆనంద్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 24 : మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌ను రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని బుధవారం మండలంలోని పెద్దిరాజుపల్లె, రాజుపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం బి.మఠం మండల ఎన్నికల ప్రచార సమన్వయకర్త పుట్టా ఆనంద్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, నాయకులు కేవీ సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, శ్రీయపురెడ్డిశ్రీనివాసులరెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి, సర్పంచ్ చిలమల నారాయణ, రామానాయుడు, మన్యం శంకర్‌రెడ్డి, వేల్పుల సుదర్శన్, వేల్పుల శ్రీకాంత్, పురుషోత్తంరెడ్డి, సురేంద్రరెడ్డి, నాగయ్య, గంగయ్య, కానాల మల్లిఖార్జునరెడ్డి, నాగేంద్ర, వెంకటేశ్ నాయుడు, గుజ్జు రామాంజనేయులు, నాగయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో రాక్షస పాలన అంతం

ఖాజీపేట, ఏప్రిల్ 24: నెల రోజుల్లో రాక్షస పాలన అంతమొందుతుందని మండల టీడీపీ నాయకులు జానకీరాం, గంగినాయుడు అన్నారు. బుధవారం పత్తూరు పంచాయతీలోని డాంఖాన్‌పల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్-6 పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పొట్టిరామయ్య, పిచ్చినాయుడు, పుల్లయ్యనాయుడు, ఉపసర్పంచ్ రమణ, రామానాయుడు, రమేష్‌నాయుడు, రామసుబ్బయ్య, టీడీపీ ఉపమండలాధ్యక్షుడు జిలానీ, పూలసుల్తాన్, నాయబ్‌రసూల్, చీకటి రామయ్య, చంద్రయ్య, నరసింహ, నంద్యాల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో సుమన్



బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 24 వీరబ్రహ్మంగారిని సినీయాక్టర్ సుమన్ బుధవారం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ మర్యాదలతో దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనరు శంకరబాలాజీ స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు, సిద్దయ్యగారిమఠం పెద్దపీరయ్యస్వామి, సిద్దయ్యస్వామిని దర్శించుకున్నారు. ఈశ్వరీదేవి మఠం పీఠాధిపతి వీరకుమారస్వామి. ఉమాపతి, శ్రీలం నరసింహులు, శీలం బాలాగౌడ్ పాల్గొన్నారు.

నరసింహుని సేవలోనూ..

బద్వేలు రూరల్, ఏప్రిల్ 24 : సినీ హీరో సుమన్ బుధవారం లక్ష్మీ నరసింహస్వామి ఆశీర్వాదం అందుకున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు పెంచలయ్య స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాజ, హరిక్రిష్ణ, అనుములశెట్టి సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి ఇంటింటి ప్రచారం

బి.కోడూరు, ఏప్రిల్ 24 : మండల పరిధిలోని మేకవారిపల్లె గ్రామ పంచాయతీలో ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్న, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో గోడి రమణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తిరుపతిరెడ్డి, దుగ్గిరెడ్డి, రాఘవరెడ్డి, క్రిష్ణారెడ్డి, పవన్, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులు

పెద్దముడియం, ఏప్రిల్ 24 : మండల కేంద్రమైన పెద్దముడియంలోని ఎంపీడీవో సభాభవనంలో బుధవారం ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పోలింగ్ రోజు సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధుల గురించి అధికారులు వివరించారు. తహసీల్దారు రవికుమార్, ఎంపీడీవో లక్ష్మీనరసింహ, డీటీ గౌసియాబేగం, సీనియర్ అసిస్టెంటు భువనేశ్వరి దేవి, రీసోర్స్‌పర్సన్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి గెలుపును వైసీపీ అడ్డుకోలేదు

అట్టహాసంగా కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న నామినేషన్



నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు

బద్వేలుటౌన్, ఏప్రిల్ 24 : బద్వేలు నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపును వైసీపీ అడ్డుకోలేదని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్న నామినేషన్ సందర్భంగా సిద్దవటం రోడ్‌లోని రామాలయం, సీఎస్ఐ చర్చీలో, మసీదులో ప్రత్యేక పూజలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రామాలయం వద్ద నుంచి జనసంద్రంగా మారిన కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరి నాగులుగురోడ్ల కూడలికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, బద్వేలు మండల అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు రాగిమాను ప్రతాప్‌కుమార్, రవితేజ, బొజ్జ అరుణమ్మ, బిగ్‌బాస్, మాచుపల్లె క్రిష్ణారెడ్డి, ఝాన్సీరాణి, మాచుపల్లె లక్ష్మీదేవి, మిత్తికాయల రమణ, జహంగీర్‌బాష, భూపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, రమేష్, వెంకటసుబ్బయ్య, సురేంద్ర, మురళీ నరసింహానాయుడు, రంతు, సూర్యనారాయణరెడ్డి, నియోజకవర్గంలోని 7మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీగా తరలివెళ్లిన కూటమి నేతలు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 24 :బద్వేలు నియోజకవర్గ బీజేపీ, టీడీపీ, జనసేనకూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి నేతలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బొజ్జ రోశన్నకు మద్దతుగా బుధవారం పోరుమామిళ్ల, రంగసముద్రం, టేకూరుపేట, క్రిష్ణంపల్లె, సిద్దవరం, రజాసాహెబ్‌పేట , టేకూరుపేట, తోకలపల్లె, కప్పలపల్లె, కవలకుంట్ల, దమ్మనపల్లె, అక్కల్‌రెడ్డిపల్లె ప్రాంతాలతో పాటు మండలంలోని 17 పంచాయతీల పరిధిల్లోని గ్రామాలకు చెందిన నేతలు తరలివెళ్లారు. రంగసముద్రం పంచాయతీకి సంబంధించి 35 వాహనాల్లో సీసీఆర్ కాంప్లెక్స్ నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

అట్లూరు..: మండలంలోని 12 గ్రామ పంచాయతీల నుంచి టీడీపీ నాయకులు బి.నందగోపాల్‌రెడ్డి, ఎం.సూర్యనారాయణరెడ్డి, పి.మల్లిఖార్జునరెడ్డి, ఎ.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఎన్డీఏ బీజేపీ ఉమ్మడి నాయకులు, కార్యకర్తలు వేలసంఖ్యలో బద్వేలు బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న నామినేషన్‌కు భారీగా బైకులు ఆటోల్లో ర్యాలీగా భారీ సంఖ్యలో బద్వేలుకు తరలివెళ్లారు.

రాచమల్లు అరాచక పాలనకు చరమగీతం పాడండి



39 వవార్డు ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 24 : వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు అరాచక పాలనుకు చరమగీతం పాడాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక 39 వవార్డు హనుమాన్ నగర్‌లో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, దేవగుడి వేణుగోపాల్‌రెడ్డి, ఆసం రఘురామిరెడ్డి, వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, పగిడాల దస్తగిరి, చంగా సిద్దయ్య, బొర్రా రామాంజనేయులు, చెన్నాశ్రీను, చింపిరి రమణ, మల్లేష్, చెన్నారంగ నాయకులు కుండాలక్షుమయ్య ,కొండయ్య వెంకట రాముడు పాల్గొన్నారు.కాగా ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఓటమి ఖాయమని సర్పంచ్ శివచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం వివేకానందనగర్ ప్రకాష్‌నగర్‌లలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన వరదరాజులరెడ్డి, చదిపిరాళ్ళ భూపేష్‌రెడ్డిలను గెలిపించాలని వరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ, అరుణ, కోడలు మీనా,మనుమరాళ్లు శిల్ప, రమణి, చమేలి వసంత 15 వార్డులోని బాలాజీ నగర్‌లో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ అరాచకాలు దౌర్జన్యాలనుంచి ప్రొద్దుటూరులో మార్పు రావాలంటే ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజులరెడ్డిని గెలిపించాలని మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి 5 వవార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం 5వవార్డు వైఎంఆర్ కాలనీలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.